KSR02B133
C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగస్టు 14, 2016

ENTERED
కథా నిలయం
E
శ్రీకాకుళం

పాడవోయి భారతీయుడా..!

అచ్చం అలానే...

స్వాతంత్ర్య పోరాట ఘటనల ఆధారంగా బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాలు విజయాన్ని సాధించాయి. గాంధీ, భగత్‌సింగ్, మంగళ్ పాండే, సుభాష్ చంద్రబోస్ లాంటి దేశాభిమానుల జీవిత ఘటనల ఆధారంగా తీసిన బయోపిక్స్ 'ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్', 'బోస్' (ది ఫర్గాటెన్ హీరో), 'గాంధీ', 'మంగళ్ పాండే' (ది రైజింగ్), 'రంగ్ దే బసంతి' చిత్రాలు జాతీయస్థాయి అవార్డుల్ని దక్కించుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల పాత్రల్లో ఎంతో మంది నటించినా అజయ్ దేవ్‌గణ్, ఆమిర్ ఖాన్‌లు భగత్‌సింగ్, మంగళ్‌పాండేలను గుర్తుకు తెచ్చారు. చిట్టగాంగ్ ప్రాంతంలో జరిగే అన్యాయాలకి వ్యతిరేకంగా తిరుగు బాటు బాట పట్టిన కల్పనా దత్తా, ప్రీతిలత వడ్డేదార్ పాత్రలో దీపిక, విశాఖ సింగ్‌లు ఒదిగిపోయారు. స్వాతంత్ర్య ఉద్యమం కోసం ప్రాణాలు కోల్పోయిన విప్లవకారులు రాజ్‌గురు పాత్రకి శర్మన్‌జోషీ ప్రాణం పెడితే అష్ఫఖుల్లా ఖాన్ పాత్రకి ప్రాణం పోశాడు కునాల్ కపూర్.







కథా నిలయం
KSR02 13 133
ENTERED

'అనుకోకుండా' ఓ తార

రీతూ వర్మ ఆమె ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేసింది. చదువుతున్నపుడే మిస్ రోజ్ గ్లో పోటీల్లో రన్నర్‌గా నిలిచింది.

- తొలిసారి నటించిన 'అనుకోకుండా' లఘుచిత్రానికి యూట్యూబ్‌లో 16,72,158 వ్యూస్ లభించడం విశేషం. ఇంకొక విశేషం ఏమిటంటే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లఘు చిత్రాల షార్టు లిస్ట్‌లో స్థానం పొందింది. ఈ చిత్రాన్ని రెండు రోజుల్లోనే తీసేశారు. అందులో ఓ ప్రేమ జంటను విడదీయడానికి రీతూ.. స్నేహితులు వేసుకున్న పందెంలో గెలుస్తుంది. 'అనుకోకుండా' అన్న టైటిల్‌కు తగ్గట్టే ప్రేమికులుగా విడిపోయిన ఆ వ్యక్తే రీతూను మొదటి చూపులోనే ఇష్టపడి ప్రేమించేస్తాడు. చివరకు వీరిద్దరూ ఒకటైపోతారు.
- దీనికి 2012లో 48 అవర్స్ ఫిల్మ్ ప్రాజెక్టు కాంపిటీషన్‌లో ఉత్తమ చిత్రంగా అవార్డు లభించింది. ఉత్తమ నటి అవార్డు రీతూను వరించింది.
- 2013లో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ లఘు చిత్రం ప్రదర్శితమవడం విశేషం. ఈ పాపులారిటీతోనే రీతూకు తెలుగు చిత్రసీమలో కథానాయికగా అవకాశాలు వచ్చాయి.
- పవన్ సాదినేని దర్శకత్వంలో తీసిన 'ప్రేమ ఇష్క్ కాదల్' చిత్రంలో మొదటిసారిగా కథానాయికగా చేసింది. అందులో సమీర పాత్రలో ప్రేక్షకులను మెప్పించింది. తొలి చిత్రమే అయినా తన నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఈ చిత్రం 2013లో విడుదలైంది.
- తర్వాత ఏడాది 'నా రాకుమారుడు'లో బిందుగా చేసింది. గతేడాది నాని హీరోగా చేసిన 'ఎవడే సుబ్రమణ్యం'లో ఒక కథానాయికగా చేసింది. ఓ పెద్ద వ్యాపారవేత్త బిడ్డగా ఆ పాత్రలో ఒదిగిపోయింది. ఈ పాత్ర చేసినందుకు గాను రీతూకు ఇండియన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అకాడమీ అవార్డు కూడా వరిస్తుందని అనుకున్నారు.
- ఈ ఏడాది మాత్రం మూడు సినిమాల్లో చేయడానికి అంగీకరించింది. అందులో తమిళంలో రెండు చిత్రాలు, తెలుగులో ఒకటి.
- తెలుగు చిత్రం 'పెళ్లి చూపులు'. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ హీరో హీరోయిన్లు.
- ఈ సినిమాలో ఈమె చిత్ర పాత్రలో చేసింది. ఆధునిక భావాలు ఉన్న అమ్మాయిలా తన హావభావాలతో ప్రేక్షకులను మెప్పించడంలో వందశాతం సక్సెస్ అయింది. ఈతరం అమ్మాయి ఎలా ఉంటుందో, ఎలా ఆలోచిస్తుందో చక్కగా చెప్పగలిగింది. అందుకే ఈ చిత్రానికి ప్రేక్షకాదరణ లభిస్తోంది. తక్కువ బడ్జెట్‌తో తీసినా పెద్ద సినిమాల సరసన చేరిపోయింది.
- త్వరలో ఆమె నటించిన తమిళ చిత్రం 'పైనా' విడుదల కాబోతుంది. ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.
- మరో తమిళ చిత్రం పెర్రై తఇదియ నాట్‌కల్‌లో కథానాయికగా చేస్తోంది. ప్రస్తుతం ఇది షూటింగ్ జరుపుకుంటోంది.
- ఇటీవల మరో కొత్త చిత్రం చేసేందుకు అంగీకరించింది. 'క్షణం' హీరో అడవి శేష ఇందులో హీరో. ముందుగా ఈ సినిమాకు అదా శర్మను హీరోయిన్‌గా ఎంపిక చేయాలని భావించారు. కానీ పెళ్లి చూపుల్లో రీతూ వర్మ నటనకు అడవి శేష ఫిదా అయిపోయాడు. వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకుని అదా శర్మ స్థానంలో రీతూ వర్మను హీరోయిన్‌గా ఎంపిక చేశాడు.
- 'అనుకోకుండా' లఘు చిత్రంలోనూ, మోడలింగ్ చేసే సమయంలో రీతూను తరుణ్ భాస్కర్ చూసి 'పెళ్లి చూపులు' చిత్రానికి కథానాయికగా ఎంపిక చేశానని ఆయనే స్వయంగా చెప్పారు. ఎవడే సుబ్రమణ్యం, ప్రేమ ఇష్క్ కాదల్ చిత్రాల్లో ఆమె చేసిన నటన చూసి తన చిత్రంలో ఈమె అయితే సరిగ్గా ఆ పాత్రకు న్యాయం చేయగలదని భావించాడంటే ఆమె నటనకు మంచి మార్కులు పడుతున్నట్టే.

- కొప్పుసెట్టి దేవరాజు

డాక్టర్ అవ్వాల్సిన వాళ్లు అనుకోకుండా యాక్టర్లు, రాజకీయ నాయకులు అవుతారు. అయినవాళ్లూ ఉన్నారు. అనుకోకుండా జీవితంలో గొప్ప గొప్ప విషయాలు జరిగిపోతూ ఉంటాయి. అలా ఓ అమ్మాయి మాత్రం 'అనుకోకుండా' అనే లఘు చిత్రంలో నటిస్తే అది ఆమె జీవితాన్నే మార్చేసింది. అనుకోని మార్పులు చేసింది. సరదాగా తీసిన చిత్రం రంగుల లోకంలో 'అనుకోకుండా' ఓ తారగా నిలిపింది. పది నిమిషాల నిడివి గల షార్ట్‌ఫిల్మ్ నేడు ఆమెను హీరోయిన్ చేసింది. ఇటీవల 'పెళ్లి చూపులు' చిత్రంలో 'చిత్ర' పాత్రలో ఆధునిక పెళ్లి కూతురిగా మెప్పించిన రీతూ వర్మే ఆ అమ్మాయి.

ప్రత్యేకం..................3
బుజ్జి గిన్నిస్ జంట
విజేత.............. 4
మన మహిళా సుమో
కార్టూన్ పంచ్......... 5
వింత లోకం...........10
ఇమానం రెస్టారెంట్
జీవితం........11
దేవదాసీ టు సీఈఓ
కవిత్వమ్...............14
ఐక్యతా రాగం

ఇండెక్స్

పాడవోయి భారతీయుడా



అట్టమీది కథ...6



సందర్భం - 12
జాతి సమైక్యతా చిహ్నం
మువ్వన్నెల జెండా

స్ఫూర్తి...................15
గుట్కాపై ఒక్కడి విజయం
కథ 16
అంకురం మొలకెత్తే వేళ
తెలుసా....................19
కెమెరా చేతికి చిక్కిందిలా..!
రుచి.....................21
సలాడ్
బాల నేస్తాలు.............23
పఫర్ ఫిష్
పద వికాసం.....
....24

చలో రియో

జులై31 ఆదివారం అనుబంధం అంశాలన్నీ అలరించాయి. "చలో రియో" ఆకట్టుకుంది. క్రీడాభిమానులు ఈసారి భారత క్రీడాకారులు మంచి ఫలితాలను సాధించగలరనే విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. ఒలింపిక్స్‌కి చేరుకున్న క్రీడాకారుల ప్రతిభాపాటవాలే అందుకు కారణం. ఒక ప్రశ్న యాత్రతో అన్నా నాదియా బ్యాండురా జరిపిన ప్రపంచ యాత్ర యువతకి స్ఫూర్తిగా నిలుస్తుంది. చిన్న వయసులోనే సాహసోపేతంగా యాత్రలు చేయడం ఆ అనుభవాలని ఇంకొకరికి ఉపయోగపడేలా చేయడం నిజంగా హేట్సాఫ్. గవిడి శ్రీనివాస్ కవిత 'అలా చూడు ప్రపంచం' హృదయాన్ని కదిలించింది. 'వన మహా ఉత్సవం' కథ ఆలోజింపచేయడమే గాక చైతన్య పరిచేలా

-వేదుల జనార్ధనరావు,
వంకావారి గూడెం

ఫర్నీచర్ పంట

వివిధ పద్ధతుల్లో చెట్లకి రకరకాల పూలు పూయించినట్లు కుర్చీలు, బల్లల ఆకారంలో గావిన్ చెట్లని పెంచటం, రీసైక్లబుల్ ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాలతో చేసిన కంపోస్టుని చెట్లకు ఉపయోగించడం ఆశ్చర్యపరిచింది.

నిరక్షరాస్యులనే ముద్ర తొలగించుకునేందుకు వృద్ధాప్యంలో బడికెళ్లాలనుకున్న ముంబయి నానమ్మల ఆలోచన అభినందనీయం. నాదియా ఒక ప్రశ్న యాత్ర ఉంది, ఒంటరిగా యాత్ర చేయాలనుకునే వారికి స్ఫూర్తినిస్తుంది. అనగనగా ఒక రాణి, మంచం నాగలి, లిక్విడ్ గోల్డ్, కార్టూన్ పంచ్ ఆకట్టుకున్నాయి.

- విశ్వేశ్వరయ్య, విశాఖపట్నం

లోహపు తీగలు

శిలపై శిల్పాలు చెక్కినట్టు తీగలతో శిల్పాల్ని చుట్టడం ఆశ్చర్యపరిచింది. దక్షిణ కొరియా కళాకారుడు సూయింగ్ మో తీగచుట్టల్ని మెలిపెట్టిన తీరు ఆకట్టుకుంది. కెమేరాకి స్టిల్స్ ఇచ్చేలా అటవీ ప్రాణుల్ని మాలిమి చేసుకోవడంలో 22 ఏళ్ల పంక్కా ఆరితేరాడు. బీడుబారిన భూముల్లో కాలేజీని నిర్మించడంతో పాటు నీటిని నిల్వచేసే కొలనులు, పచ్చని లాన్లతో ఆరావళి కళాశాల నిర్మించడం అభినందనీయం. తమ అవసరాల కోసం చెట్లని ఇష్టం వచ్చినట్టు నరికేస్తూ పర్యావరణ కాలుష్యానికి కారకులవుతున్న వారికి వన మహా ఉత్సవం కథ కనువిప్పునిస్తుంది.

-సత్యవతి, అనంతపురం

నానమ్మల బడి

ముంబయి దగ్గరలోని గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధాప్యంలోనూ మహిళలందరూ చదువుకోవాలనుకోవడం మంచి పరిణామం. చెట్లను కాపాడాల్సిన బాధ్యతని తెలియజెప్పిన వన మహా ఉత్సవం కథ, లిక్విడ్ గోల్డ్, పోకెమొన్ బీమా, ఫర్నీచర్ పంట, హాలీవుడ్ 2 బాలీవుడ్, కరానా కథ బాగున్నాయి.

- హనుమంతరావు, ఒంగోలు

వన మహా ఉత్సవం కథ చాలా బాగుంది.

- కాజా హుస్సేన్, ఇ-మెయిల్

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com





వాళ్లిద్దరి పొడవు కలిపి ఐదు అడుగుల ఒక అంగుళం. కానీ ఇరువురు మధ్య నాటుకుపోయిన ప్రేమ లోతును అంచనా వేయడం కష్టం. స్వచ్ఛమైన హృదయాలతో త్వరలోనే ముడిపడనున్న ఈ ప్రేమ జంట అందరినీ ఆకర్షిస్తోంది. ఆత్మీయులు, స్నేహితుల మధ్య వీళ్ల నిశ్చితార్థ వేడుక ఇటీవల బ్రెజిల్‌లో జరిగింది. వివాహ బంధంతో ఒకటైన మరుక్షణం ప్రపంచంలోనే అతి పొట్టి దంపతులుగా గుర్తింపు పొందనున్నారు. గిన్నిస్ రికార్డులో స్థానం వాళ్లకు పెళ్లి కానుకగా రానుంది.

బుజ్జి గిన్నిస్ జంట

పాలో గేబ్రియేల్‌కు తన గర్ల్ ఫ్రెండ్ హొసీనా అంటే అమితమైన ప్రేమ. వీరిరువురు మధ్య స్నేహం ఎనిమిదేళ్ల నుంచి కొనసాగుతోంది. గేబ్రియేల్ వయస్సు 30 యేళ్లు. నిలబడితే 34.8 సెంటీ మీటర్ల పొడవుంటాడు. హొసీనాకు 26 యేళ్లు. 35.2 సెంటీ మీటర్లు పొడవుంటుంది. ఈ ఎనిమిదేళ్ల ప్రయాణంలో వాళ్లు ఎదగకపోయినా, ఉన్నతమైన ప్రేమ శిఖరాన్ని అందుకోగలిగారు. మరుగుజ్జుతనం శరీరానికి తప్ప మనసుకు లేదని చాటి చెప్పారు.

ఇలా చెప్పాడు

గేబ్రియేల్ ఒక రోజు హొసీనాను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. హొసీనా వచ్చిన తర్వాత ఇన్నేళ్ల స్నేహంలో ప్రేమించాననే మాట తనకు ఎలా చెప్పాలో గేబ్రియేల్‌కు అర్థం కాలేదు. హొసీనా అంగీకరిస్తుందా? లేదా? ఇన్నేళ్ల తమ స్నేహం ఏమవుతుందోనన్న భయం ఆయనలో మొదలైంది. ఏదేమైనా మనసులో మాట బయటపెట్టాలని అన్ని విధాల సంసిద్ధుడయ్యాడు. ఇంతలో హొసీనా రానే వచ్చింది. ఇంకేముంది ఆమెను చూడగానే తను చెప్పదలచుకున్న విషయాలన్నీ గేబ్రియేల్ మర్చిపోయాడంట. ఒక్క విషయం తప్ప... అందరిలా కవిత్వాలు చదవకపోయినా ఉన్న మాట సూటిగా చెప్పాలనుకున్నాడు. వెంటనే... "మనమిద్దరం పెళ్లి చేసుకుందాం హొసీనా..." అని టక్కున మనసులో మాట బయటపెట్టాడు. మనిద్దరం పెళ్లి చేసుకుంటే ప్రపంచంలో అతి చిన్న జంటగా వరల్డ్ రికార్డు కూడా సంపాదిస్తాం" అని గేబ్రియేల్ చెప్పాడు. హొసీనా కోపంతో వెంటనే అక్కడ నుంచి వెళ్లిపోయింది. గేబ్రియేల్ తనతో పరిహాసమాడుతున్నాడు అనుకుంది హొసీనా. తర్వాత కూడా చాలా సార్లు చెప్పి చూశాడు. గేబ్రియేల్ అడిగిన ప్రతి సారీ "నాకిష్టమే" అని హొసీనాకు చెప్పాలనుండేది. కానీ ఆ ప్రపోజల్ నిజమో కాదో అర్థమయ్యేది కాదు. చివరకు తన మాటల్లో నిజాయితీని తెలుసుకున్న హొసీనా కొన్నాళ్లకు 'ఓకే' చెప్పింది. వెంటనే నిశ్చితార్థానికి తేదీ ఖరారు చేశాడు. ఇటీవల గేబ్రియేల్ నివాసంలో నిశ్చితార్థ వేడుక కాస్తా ముగిసింది. ఇక ఆ చిన్ని జంట వివాహ ఏర్పాట్లలో మునిగిపోయింది. హొసీనా అయితే తనకు సరిపడా వెడ్డింగ్ డ్రెస్ కోసం వెతుకులాట మొదలుపెట్టిందట. వీళ్ల నిశ్చితార్థ ఫోటోలు ఇటీవల విడుదలయ్యాయి.

ఇదే పరిచయం

గేబ్రియేల్ హొసీనా పదేళ్ల క్రితం చాటింగ్ ద్వారా కలుసుకున్నారు. గేబ్రియేల్ లీగల్ సెక్రటరీగా పనిచేసేవాడు. 186 మైళ్ల దూరం



ప్రయాణించి, లాండ్రినాలోని హొసీనా ఇంటికి వెళ్లి కలిసేవాడు. హొసీనా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంది. ప్రత్యేకత ఏమిటంటే తమలా మరగుజ్జు వారి కోసం ఒక బ్యూటీ సెలూన్ నడుపుతోంది. మొదట్లో గేబ్రియేల్ వస్త్రధారణ ఇంకా మెరుగ్గా ఉంటే బాగుండేదనిపించేదట హొసీనాకు. చెబితే ఏమనుకుంటాడో అని కాస్త సంకోచించేదట. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిన తర్వాత ఒక బ్యూటీషియన్‌గా అతడికి సలహాలిచ్చేది. అవి బాగా నప్పడంతో అప్పటి నుంచి హొసీనా చెప్పిన విషయాల్ని తూచా తప్పకుండా పాటించడం మొదలుపెట్టాడు. గేబ్రియేల్‌కు ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిందామె. ఆమె ఆలోచనలను కాదనుకుండా గేబ్రియేల్ గౌరవించడం బాగా నచ్చింది. గేబ్రియేల్‌కు దూరపు ప్రయాణాలంటే చాలా ఇష్టం. కానీ వారి సైజుకు అనుకూలంగా డ్రైవింగ్ చేసే కార్లు ఉండవు కదా. వారిలాంటి వారందరికీ ఈ అభిలాష తప్పక ఉంటుంది. అందుకే గేబ్రియేల్ వారి కోసం ప్రత్యేకంగా కార్లను రూపొందించడం మొదలుపెట్టాడు. వారి ఇద్దరి వ్యక్తిత్వాలు, ఆలోచనలు, భావనలు ఒకేలా ఉండేవి. హొసీనా కాస్త దుందుడుకుగా ఉంటే గేబ్రియేల్‌కు సహనం చాలా ఎక్కువట. అందుకే వీరిద్దరి మధ్య బంధం పటిష్ఠమైందని ఇద్దరూ చెబుతారు. హొసీనాతో పోల్చుకుంటే తాను ఎందులోనూ ఎక్కువ కాదంటాడు గేబ్రియేల్. చివరకు ఎత్తులో కూడా తక్కువే.

- మంగ. కె

మన మహిళా సుమో



సుమో రెజ్లర్‌గా మహిళలకు ప్రవేశం ఉంది అంటే నమ్మశక్యం కాదేమో! అందులోను మన దేశ క్రీడాకారిణిని సుమోగా ఊహించడం అసాధ్యమనిపిస్తుంది. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి రెజ్లర్ పోటీల చరిత్రలో తనకంటూ ఓ స్థానాన్ని సుస్థిరపరచుకున్నది హెతల్ దవే. మనదేశానికి చెందిన తొలి సుమో రెజ్లర్‌గాను గుర్తింపు పొందింది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోయినా, స్పాన్సర్లు ముందుకు రాకపోయినా, మొక్కవోని అకుంఠిత దీక్షతో, కఠోరశ్రమతో 2009లో ప్రపంచస్థాయిలో జరిగిన సుమో రెజ్లర్ పోటీలో మన దేశం తరపున అది 5వ స్థానంలో నిలిచింది. వర్థమాన మహిళా క్రీడాకారులకు ఈ విజేత జీవితం స్ఫూర్తిదాయకం.

హెతల్ దవే ఓ శాకాహారి. జపాన్‌కు చెందిన సుమో రెజ్లర్‌ల వలె భారీ విగ్రహం కాదు. ఆమె ఎత్తు 5.6 అడుగులే. బరువు 78 కేజీలు మాత్రమే. అయినా సుమో రెజ్లింగ్‌లో రాణించాలని సంకల్పించుకుంది. హెతల్ దవే 26 సంవత్సరాల వయసులో 2007లో క్రీడా ప్రస్థానం ప్రారంభించింది. ఆమె జూడోతో మార్షల్ ఆర్ట్స్‌లో కెరీర్‌ను ప్రారంభించింది. ఆమె కోచ్ తరచుగా జపాన్ వెళ్తూ రెజ్లింగ్ ఆట గురించి చెప్తుండేవాడు. దీంతో హెతల్‌లో సుమో రెజ్లర్ కావాలనే కోరిక బలపడింది. జూడోలో పురుష క్రీడాకారులను సైతం ఓడించగలిగే సామర్థ్యం హెతల్‌ది. అదే సుమో రెజ్లింగ్‌లోను ఉపయోగపడింది. సుమో రెజ్లర్‌గా మారిన మొదట్లో 5 మ్యాచ్‌లలో పాల్గొనగా 3 మ్యాచ్‌లలో విజయం సాధించడంతో ఇక వెనుతిరగలేదు.



తనకు తానే...

శిక్షణకు జపాన్ వెళ్లి నేర్చుకునేంత ఆర్థిక వెసులుబాటు హెతల్‌కు లేదు. దేశంలోను ఆ విద్యపై అంత నైపుణ్యమున్న కోచ్‌లు లేరు. కానీ హెతల్ ఎలాగైనా సుమో రెజ్లింగ్‌ను పట్టు పట్టాలి. అందుకే స్వంతగా తనకు తానే కోచ్‌గా మారింది. యూట్యూబ్ వీడియోల్ని చూస్తూ అనేక మెళకువలు తెలుసుకొనేది. సొంతగానే విదేశీ పోటీలకు దరఖాస్తు చేసుకుంది. 2008లో ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. స్పాన్సర్ల కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ ఏ సంస్థ ముందుకు రాలేదు. సుమో రెజ్లింగ్ ఆట పురుషులకు సంబంధించినదనే ఆలోచనతో, హెతల్ దవే సుమో అంత భారీగా, ధృడంగా కనిపించకపోవడంతో స్పాన్సర్లు పెట్టుబడి పెట్టడానికి సాహసించలేదు. పలు సందర్భాలలో ఆమెకి అవమానాలు, ఛీత్కారాలు ఎదురయ్యాయి. 'మహిళకు.. సుమో రెజ్లింగ్ ఆటా...' అంటూ నిరుత్సాహపరిచారు. స్పాన్సర్లు లేకపోవడంతో 2008 నుంచి 2012 వరకు ఆమె పోటీల్లో పాల్గొనడం చాలా కష్టమైంది.

విదేశాల్లో ఆదరణ

ఒకవైపు ఆర్థిక సమస్యలు, మరోవైపు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం కరువు, ఇంకొక వైపు నిరుత్సాహపరిచే వాతావరణం ఉన్నప్పటికీ ఏ దశలోనూ నిరుత్సాహపడకుండా పోరాట పటిమను ప్రదర్శించింది. మన దేశం తరపున పోటీల్లో పాల్గొనేందుకు ఎస్టోనియా పర్యటనకు వెళ్ళింది. ఆ సిటీ మేయర్ హెతల్ దవే గురించి తెలుసుకుని స్వాగతం పలకడానికి తన కూతురితో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఓ హోటల్‌కి తీసుకెళ్లి స్వయంగా ఆతిథ్యమిచ్చారు. విదేశాలలో తనకంత ఆదరణ లభించడంతో ఆమెకు కొత్త ఉత్సాహం లభించింది.

ఆర్థిక ఇబ్బందులను ఎదురీదుతూ హెతల్ 2008లో ఎస్టోనియా, పోలాండ్, తైవాన్‌లలో జరిగిన పోటీలకు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. రెండు ప్రపంచ పోటీల్లో పాల్గొంది. 2009లో తైవాన్‌లో జరిగిన ప్రపంచ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో మిడిల్ వెయిట్ విభాగంలో 5వ స్థానంలో నిలిచింది. అయితే ఒలింపిక్స్ పోటీల్లో సుమో రెజ్లింగ్‌కు గుర్తింపు ఇవ్వకపోవడం ఆమెనెంతో కలచి వేస్తోంది. సుమో రెజ్లర్స్ చాలామంది ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తారు. సుమో రెజ్లర్ అంటే జపాన్ సుమోలున్నట్లుగా ఉండాలను కుంటారు. హెతల్ శాకాహారి కావడంతో చాలా తక్కువ బరువుంటుంది. సాధారణ ఆహార నియమాలను మాత్రమే పాటిస్తుంది. పోషకా హారం కోసం బీన్స్‌ను ఎక్కువగా తీసుకుంటుంది. ఆటకు శారీరక దారుఢ్యమే కాదు.. ఆత్మవిశ్వాసం, సంకల్ప బలముంటే ఏదైనా సాధించగల మంటుంది హెతల్.

నాన్నే అండగా

హెతల్ దవేలోనున్న ఆసక్తిని గమనించిన కుటుంబసభ్యులు అండగా నిలిచారు. కూతురికి చేదోడు, వాదోడుగా ఉండాలని ఆమె తండ్రి ఉద్యోగానికి రాజీనామా చేసి కుమార్తెకు తోడుగా ఉండేవాడు. ప్రస్తుతం ముంబై ఓవెల్ మైదానంలో తన తమ్ముడు అక్షయ్‌తో నిత్యం ప్రాక్టీసు చేస్తుంది. తనకంటూ ఒక కోచ్ ఉంటే ఇంకా అభివృద్ధి సాధిస్తుందని కుటుంబసభ్యులు భావించారు. హెతల్‌కు నేటికీ స్పాన్సర్స్ దొరక్కపోవడంతో ఆమె స్వశక్తిగా నిలబడేందుకు ఒక అకాడమీని ప్రారంభించింది. ఇందులో అన్ని రకాల ఆటలకు సంబంధించిన శిక్షణను ఏర్పాటు చేశారు. విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులు ఆమె భవిష్యత్తుకు ఉపయోగపడతాయని వారి ఆలోచన. ఆమె స్పాన్సర్ల కోసం గడప గడప తిరిగింది. అయినా స్పాన్సర్‌లు లభించలేదు. ఈ క్రీడ చూసేవారికి చాలా సులువనిపిస్తుంది. రింగ్‌లోనుంచి నెట్టడమే కదా అని అనుకుంటారు. కానీ ఇది చాలా కఠినమైన క్రీడ. ఈ ఆటలో ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే క్షణాల్లో విజేత మారిపోతారని హెతల్ అంటుంది.

- స్వర్ణలత నూకరాజు



కార్టూన్ పంచ్

నవ్వుల్ - పువ్వుల్

నెమ్మదిగా

చింటు: బామ్మా! ఇవ్వాళ నేను పరుగు పందెంలో పాల్గొంటున్నా. కప్పు గెలుచుకురావాలని దీవించు!

బామ్మ: జాగ్రత్త! తొందరపడకుండా వెనకా ముందు చూసుకుంటూ నెమ్మదిగా పరుగెత్తు. లేకపోతే దెబ్బలు అవీ తగుల్తాయ్!

తెలిసిపోయింది

రాధ: నేనిప్పటి వరకు ఎంతో వర్రీ అయిన ఒక విషయం గురించి నిన్నే తెలిసిపోయింది.

రమ్య: ఏంటా విషయం

రాధ: ఇన్నాళ్లు మా ఆయన రాత్రి పన్నెండింటి వరకూ ఎక్కడ తిరిగేవాడో నాకర్థమయ్యేది కాదు. ఇప్పుడర్థమైంది.

రమ్య: ఏం తెలిసింది .....ఎలా తెలుసుకున్నావ్

రాధ: నేను నిన్న రాత్రి వరకు టీవీలో వచ్చే సీరియల్స్ చూడలేదు కదా. అప్పుడు తెలిసిపోయింది ఆయన ఇంట్లోనే ఉంటున్నాడని.

నెంబర్



భార్య: ఏమండి రేపు మనింటికి పార్టీకి వచ్చే వాళ్లకి స్వీట్ హాట్‌తో పాటు ఇంకా ఏం ఇమ్మంటారు.

భర్త: నా ఫోన్ నెంబర్ కూడా ఇవ్వు.....



పాడవోయి భారతీయుడా

స్వాతంత్ర్య దినోత్సవం వస్తే టీవీలో ఎఫ్ఎంలో, రేడియోలో దేశభక్తి గీతాలు శుభాకాంక్షలు చెబుతాయి. కొన్ని పాటలు మాత్రం అజరామరమైతే... కొన్ని పాటలు పదే పదే రిపీట్ అవుతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 68 ఏళ్లు అవుతున్నా కొన్ని సినిమా పాటలే పాడుకోవడానికి ఉన్నాయి. అవే అవే ప్రతి ఏటా వినడానికి కారణం అవి క్లాసిక్స్ అనేకాదు మరో క్లాసిక్ దేశభక్తి గీతం తెలుగు సినిమాలో రావడం లేదు. పాత చిత్రాల్లో ఆపాత మధురాలనదగ్గ దేశభక్తి గీతాలు అనేకం. కానీ ఈ తరంలో ఎన్ని సినిమా పాటలు దేశభక్తిని రగిలిస్తున్నాయి, సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయి. పాత సినిమాల్లోని గొప్ప గీతాలు, నేటి చిత్రాల్లోని అరుదైన పాటలపై.. నానాటికీ కనుమరగవుతోన్న తెలుగు సినిమా దేశభక్తి గీతాలపైనే ఈ వారం అట్టమీది కథ.

- కలిముల్లా
9490227332

"పాడవోయి భారతీయుడా... ఆడి పాడవోయి విజయ గీతికా..." అంటూ ప్రతి యేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు నాట శ్రీశ్రీ రాసిన పాట మార్మోగుతూనే ఉంటుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 13 ఏళ్ళకు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా ఆ మహాకవి 'వెలుగు నీడలు' చిత్రం కోసం ఆ గీతాన్ని రచించారు. ఆ పాట వయసు 55 సంవత్సరాలు. స్వరాజ్య భారతం 69వ పుట్టినరోజు జరుపుకుంటోంది. అయినా దేశంలో ఇప్పటికీ అంతగా మారని పరిస్థితులే మనకు అడుగడుగునా ప్రత్యక్షమవుతున్నాయి. ఆ పాటలోని ప్రతి అక్షరం మన కళ్ళ ముందు నేటికీ సాక్షాత్కారమవుతోంటే... సదరు పరిస్థితులను అధిగమించడానికి మన సినిమాల్లోని మరికొన్ని దేశభక్తి గీతాలు మనకు స్ఫూర్తినిస్తున్నాయి.

మనకు స్వరాజ్యం సిద్ధించక ముందే తెలుగు సినిమాల్లో స్వేచ్ఛా పిపాసతో నిండిన పలు గీతాలు రూపొందాయి. స్వేచ్ఛా భారతంలో కూడా అనేక చిత్రాలలో దేశభక్తిని ప్రబోధించే గీతాలు చోటు చేసుకున్నాయి. ఆ పాటలన్నీ ప్రతి స్వాతంత్ర్య దినోత్సవాన మనల్ని పలకరిస్తూనే ఉంటాయి. "భారతమాతకు జేజేలు... బంగారు భూమికి జేజేలు... ఆసేతు హిమాచల సస్యశ్యామల జీవధాత్రికి జేజేలు..." అంటూ 'బడిపంతులు' చిత్రం కోసం ఆత్రేయ రాసిన గీతం, ఘంటసాల గళంలో అమరత్వం పొంది వీనులకు విందు

చేస్తుంది. రవీంద్రుని 'జనగణమన' గీతం ప్రేరణతో ఈ పాట రూపొందినట్లు కనిపిస్తుంది.

ఈ పాటలో మన దేశ నైసర్గిక స్థితిగతులు చోటు చేసుకోవడమే గాక, మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనం కూడా కనిపిస్తుంది. "నా జన్మ భూమి ఎంత అందమైన దేశము..." అంటూ 'సిపాయి చిన్నయ్య' ఆడి పాడిన వైనాన్ని ఎవరు మరచిపోగలరు?

అంతేనా... తెలుగువారి విప్లవజ్యోతి 'అల్లూరి సీతారామరాజు'లోని "తెలుగువీర లేవరా... దీక్షపూని సాగరా... దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా..." అన్న గీతం వీనులకు సోకగానే ఆనాటి పౌరుషం ప్రతి తెలుగువానిలోనూ తొంగి చూస్తుంది. అందుకే ఆ గీతం జాతీయ స్థాయిలో ఉత్తమ గీతంగా నిలచింది. ఇక ఆనాటి 'సర్వాయి పాపన్న' వీర గాథ స్ఫూర్తితో తెరకెక్కిన 'సర్దార్ పాపారాయుడు'లో "వినరా సోదర వీరకుమారా... భారతయోధుల గాథలు..." అన్న బెనర్జీ బుర్రకథను, అదే గేయానికి అనుబంధంగా వచ్చే "ఒక యోధుడి మరణం... శతవీరుల జననం... ఇంతటితోనే వీరుల గాథలు అంతం కాలేదు..." అంటూ సాగిన ఆ శ్రీశ్రీ గీతానికి జీవం పోసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గళమహత్యం మరపు రానిది కాదా!

అదే గళంలో వీర జవానులకు స్ఫూర్తినిచ్చే దేశభక్తి గీతం 'బొబ్బిలిపులి' లోనూ "జననీ జన్మ భూమిశ్చ... స్వర్గాదపి గరీయసీ..." అంటూ సాగింది.

ఆ పాట విన్నాక దేశభక్తితో పులకించని మేను తెలుగు నాట కానరాదు. "ఎగరాలి... జాతీయ పతాకం ఎగరాలి..." అంటూ స్ఫూర్తి నింపే 'మోస గాడు'లోని వేటూరి గీతాన్ని ఎవరు మరువగలరు. "నేనూ నా దేశం... పవిత్ర భారతదేశం..." అంటూ 'నేనూ- నాదేశం'లోని గీతం కూడా మన తెలుగువారి స్మృతిపథం నుంచి చెరిగిపోదు.

ఇక 'మేజర్ చంద్రకాంత్'లోని "పుణ్యభూమి నా దేశం నమో నమామీ... ధన్యభూమి నా దేశం సదా స్మరామీ..." అన్న గీతం వినేవారికి 'జాలాది' ప్రతి పదం దేశభక్తిని నింపుతుంది. అదే పాటలో నందమూరి అభినయాన్ని చూసి ఉత్తేజితులు కానివారెవరుంటారు? ఆ తరం హీరోల చిత్రాల్లోనే కాకుండా ఆ తరువాత వచ్చిన సినిమాల్లోనూ కొన్ని దేశభక్తి గీతాలు చోటుచేసుకొని తెలుగువారిలో మన భరతమాతపై మరింత భక్తిప్రపత్తులను పెంచాయి.

ప్రముఖ నిర్మాణ సంస్థ 'పక్షిరాజా' వారు 'అగ్గిరాముడు' చిత్రాన్ని నిర్మిస్తున్న రోజుల్లో మద్రాసు వాణీ మహల్లో బుర్రకథ పితామహుడు నాజర్ ప్రదర్శనలో 'అల్లూరి సీతారామరాజు'

పాత్రను హీరో ఎన్.టి.రామారావు చూడటం జరిగింది. నాజర్ అభినయ కౌశల్యానికి ముగ్ధుడైన ఎన్.టి.ఆర్ అగ్గిరాముడులో ఆ బుర్రకథను పెడితే బాగుంటుందని భావించాడు. ఆ విధంగా నాజర్ దళం (కర్నాటి లక్ష్మీనరసయ్య, రామకోటి పంతులు) 'అగ్గిరాముడు' చిత్రంలో చెప్పిన "అల్లూరి సీతారామరాజు" బుర్రకథ ఆ చిత్రానికే హైలెట్‌గా నిలిచింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో నాజర్ బుర్రకథ వాడ వాడలా ఉర్రూతలూగించింది.

ప్రత్యేకంగా ఒక పాట

1965కు ముందు వరకూ తెలుగు చిత్ర నిర్మాతల్లో ఎక్కువ మంది తమ చిత్రాల్లో సామాజిక చైతన్య పూరిత పాటలు లేదా దేశభక్తి పాటల్ని ప్రత్యేకంగా వుంచేవారు. 1954లో ఏ.వి.యం. సంస్థ నిర్మించిన 'సంఘం' చిత్రంలో "భారత వీరకుమారిని నేనే.. నారీ రతనము నేనే..

భారత నారీ అభ్యుదయానికి నాయకురాలిని నేనే" అనే పాట నాడు మహిళల్లో ఎంతో ఆత్మ విశ్వాసాన్ని నింపింది. 1956లో భలేరాముడు చిత్రంలోని 'భారత వీరా ఓ భారత వీరా లేరా సోదరా లేరా మేల్కొన భారత దేశము నీదేరా... స్వతంత్ర్య భానుడు ఉదయించే స్వతంత్ర్య వాయువు ప్రసరించే ఓ భారత వీరా" అనే పాట వంటివి నాటి చిత్రాల్లో నిర్మాతల అభిరుచిగా మాత్రమే కాకుండా ఒక ఆనవాయితీగా కూడా ఉండేది.

'అన్నపూర్ణ', 'ఎన్.ఎ.టి.' వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు తమ చిత్రాల్లో దేశభక్తి పాటలు గాని లేదా అభ్యుదయ సామాజిక పాటలు గానీ తప్పనిసరిగా పెట్టేవి. ఈ విధంగా వెలుగు నీడలు చిత్రంలో శ్రమజీవులనుద్దేశించి శ్రీశ్రీ రాసిన 'ఓ రంగయో పూలరంగయో...' పాట, ఎన్.ఎ.టి వారు నిర్మించిన 'రేచుక్క-పగటి చుక్క' చిత్రంలోని 'అన్నలారా తమ్ములారా ఆరోగ్యమే భాగ్యము మన భాగ్యము సౌభాగ్యము' అనే పాటలు ఆలోచింపజేశాయి. 1970లలో తెలంగాణా వేర్పాటు ఉద్యమం బాగా జరుగుతున్న సందర్భంలో ఎన్.టి.రామారావు తాను నిర్మించిన 'తల్లా పెళ్లామా' చిత్రంలో సి.నారాయణ రెడ్డి రాసిన 'తెలుగు జాతి మనది నిండుగా వెలుగు జాతి మనది' అనే సమైక్య నినాద పాట పెట్టడం ఆయన సామాజిక చైతన్యానికి, దేశభక్తికి నిదర్శనం.

1955 స్వాతంత్ర్య దినోత్సవం నాడు విడుదలైన 'దొంగరాముడు' చిత్రంలో 'భలే తాత మన బాపూజీ...బాలల తాత బాపూజీ" పాటపెట్టడం యాదృచ్ఛికం కాదు. అదే విధంగా

నాజర్ బుర్రకథ

బొబ్బిలి పులి

'పూల రంగడు' (1967) సినిమాలో 'వినరా భారత వీర సోదరా విజయము మనదేరా' అనే బుర్రకథ స్వాతంత్ర్యానంతర దేశంలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి ఎంతో స్పష్టంగా ఎలాంటి మినహాయింపులు లేకుండా చెప్పటం నిర్మాతల సామాజిక బాధ్యతను తెలియజేసింది. అభ్యుదయ, సామాజిక, దేశభక్తి పాటలు 1950 దశకంలో దాదాపు ప్రతి చిత్రంలోనూ ఉండేవి.

నాడు విడుదలైన 'రాజా మలయ సింహ' చిత్రంలో 'జయజయ భారత వీరుడా... జయ స్వాతంత్ర్య యోధుడా... త్యాగ మహిమనే చూపరా..ధర్మమునే ఇల స్థాపించరా', 'కొండ వీటి దొంగ' (1956) చిత్రంలోని 'సాహసమే జీవిత పూబాటరా.. సత్యమే నీ లక్ష్యమని చాటరా..", 1957 లోని చిత్రం 'రేపు నాదే'లో 'మన పిల్లలన్నా సుఖియంతు రన్నా మనసారా దేశం కోసం ముందడుగు వేయన్నా... రేపు నీదన్నా..." వంటి పాటలు ఎంతో ఉత్తేజాన్ని ఇస్తాయి. 1966లో జగ్గయ్య నిర్మించిన 'పదండి ముందుకు'లో 'మేలుకో.. సాగిపో.. బంధనాలు తెంచుకో...' అనే శ్రీశ్రీ రాసిన పాట సినిమా చూసిన వారికే గాదు విన్న వారికి సైతం అద్భుతమనిపిస్తుంది.

1956లో వచ్చిన 'జయం మనదే'లోని 'వస్తుందోయ్ వస్తుంది.... కారే పేదల చమట లేరులై ప్రపంచాన్ని కబళించే రోజొస్తుంది.' అంటూ కార్మిక కర్షక శక్తిని చాటే పాట 'కొసరాజు' కలం నుండి జాలువారింది.

1973లో ఎన్.టి.ఆర్ నటించిన 'దేశోద్ధారకుడు' చిత్రంలోని 'ఆకలై అన్నమడిగితే పిచ్చోడన్నారు నాయాళ్ళు... కడుపు మండి న్యాయమడిగితే ఎర్రోడన్నారు నాయాళ్ళు..' అనే పాట ప్రస్తుత వ్యవస్థలోని దుర్మార్గాన్నీ ఎండగడుతుంది. అక్కినేని నాగేశ్వరరావు నిర్మించిన 'మరో ప్రపంచం' చిత్రం ఒక అభ్యుదయ చిత్రంగా చెప్పవచ్చు. అందులోని పాటలన్నీ దేశభక్తి పూరితమైనవే. కానీ ఆ చిత్రం బాక్సాఫీసు వద్ద బోల్తా పడటంతో (కారణాలు అనేకం ఉన్నాయి) 'నాగేశ్వరరావు ఇలాంటి చిత్రాలు నిర్మించి చేతులు కాల్చుకున్నారు. ఇలాంటి సినిమాలు జనం చూడరు.' అని కొందరు అనేక సందర్భాలలో చేసిన ప్రకారం అభ్యుదయ చిత్రాలు నిర్మించాలనుకునే నిర్మాతలను సంకటంలో పడేయటం శోచనీయం. 'పవిత్ర బంధం' చిత్రంలో ఆరుద్ర రాసిన 'గాంధీ పుట్టిన దేశమా' అనే పాట దేశ నిర్మాణం మీద మంచి గీతంగా పేరొందింది. 'రాక్షసుడు'లోని దేవులపల్లి కృష్ణశాస్త్రి గీతం "జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి..."లోని ప్రతి పదం మది పులకింప చేస్తుంది. కేవలం భరతమాత గొప్పతనాన్ని చాటే గీతాలే కాకుండా, శ్రీశ్రీలాగే ఆయా కాలాల్లోని పరిస్థితులకు అనుగుణంగా కొందరు కవులు తమ కలాలను పలికించారు. సరిగ్గా మన దేశం స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి కలం 'సింధూరం'లో 'అర్ధ శతాబ్దం అజ్ఞానాన్ని స్వతంత్రమందామా... స్వర్ణోత్సవాలు చేద్దామా..." అంటూ ప్రశ్నించిన తీరు ఆలోచింప చేయక మానదు. మన తెలుగు చిత్రాల్లోని మరెన్నో దేశభక్తి గీతాలు, స్ఫూర్తి గీతాలు స్వాతంత్ర్య దినోత్సవాన మన వీనులకు విందు చేస్తూ ఉంటాయి.

తరం మారే కొద్దీ అంతరం

ఆ తర్వాత దశాబ్దాల్లో వచ్చిన సామాజిక చిత్రాల్లో అప్పటి వ్యవస్థల గురించి కొన్ని గొప్ప గీతాలు వచ్చాయి.

ఒకప్పుడు తెలుగు సినిమా అంటే ఏదో ఒక దేశభక్తి గీతం స్ఫూర్తి రగిల్చేది. క్రమేణా ఆ పాటలు తగ్గిపోతూ వచ్చాయి. ఏడాదికి విడుదలయ్యే సినిమాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతూ వచ్చినా దేశభక్తి గీతాల సంఖ్య మాత్రం అడుగంటింది. 'ప్రతిఘటన' చిత్రంలో వేటూరి సుందరరామ్మూర్తి రచించిన 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో...' పాట కూడా సమాజ వ్యవస్థలోని కుళ్లును కడిగిపారేస్తుంది. 'రేపటి పౌరులు', 'నేటి భారతం', 'భారత్ బంద్' వంటి చిత్రాల్లోని పాటలు సమాజంలోని లోపాల్ని వివరిస్తాయి. దర్శకులు దాసరి నారాయణ రావు, కె.రాఘవేంద్రరావు తదితరులు తమ చిత్రాల్లో దేశభక్తి గీతాల్ని చొప్పించేవారు. ఆర్.నారాయణ మూర్తి చిత్రాల్లో పాటలూ దేశానికి చెందినవే. ఆ తర్వాత వచ్చిన చిత్రాల్లో ఆ ఆలోచన చేసినవారు తరిగిపోయారు. రెండు మూడు దశాబ్దాల కాలంలో వచ్చిన చిత్రాల్లో కొన్నే పాటలు రాగా, ఆ గీతాలన్నీ బాగా ఆదరణ పొందాయి. 'పరదేశీ'లోని 'జగతి సిగలో జాబిలమ్మకు..' పాట ఓ అద్భుతం. 'ఝుమ్మంది నాదం' చిత్రంలోని 'దేశమంటే...' గీతం కూడా ఎంతో బాగుంటుంది. ఖడ్గం చిత్రంలోని 'మేమే ఇండియన్స్...' పాట బాగా ఆదరణ పొందింది. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన మరో చిత్రం 'మహాత్మ' చిత్రంలోని పాట కూడా ఆలోచింపజేస్తుంది. 'భారతీయుడు'లోని 'తెప్పలెల్లి పోతుంటే..', 'రోజా'లోని 'వినరా వినరా దేశము మనదేరా' పాటల్ని ఏ.ఆర్. రహ్మాన్ స్వరపరిచాడు. పవన్ కళ్యాణ్ 'ఖుషీ'లోని 'యే మేరా జహా...' పాట హిందీలో సాగినా తెలుగు ప్రేక్షకుడికి బాగా కనెక్ట్ అయ్యింది. మణిశర్మ సంగీతాన్ని అందిస్తే అబ్బాస్ టైర్‌వాలా రచించిన ఈ పాటకు కె.కె. గొంతుకనిచ్చాడు. మహేష్



బాబు నటించిన 'బాబీ' చిత్రంలోని 'ఈ జెండా పసిబోసి చిరునవ్వురా...' పాటను శంకర్ మహదేవన్ అద్భుతంగా ఆలపించాడు. 2004లో వచ్చిన 'జై' చిత్రంలోని 'దేశం మనదే..' పాట రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంటుంది. అనూప్ రూబెన్స్ స్వరపరిచిన ఈ పాటను కులశేఖర్ రాశాడు. బేబీ ప్రెట్టీ అనే చిన్నారి చేత పాడించిన ట్రాక్ చాలా ఆర్ద్రంగా ఉంటుంది. ఎన్ శ్రీనివాస్ పాడాడు. 'బద్రి'లోని 'ఐయామ్ యాన్ ఇండియన్', 'లీడర్'లోని 'దేశము...', 'సుబ్బు'లోని 'జననీ జన్మ భూమి..' వంటి పాటల్ని ప్రేక్షకులు బాగా ఆదరించారు. చాలా సినిమాల్లో దేశభక్తి గీతాల జాడ కనిపించకపోవడం ఆలోచించాల్సిన విషయం. ప్రస్తుతం చాలా వరకు ప్రతి సినిమాలో ఐటెం సాంగ్ కనిపిస్తూనే ఉంది. అలాంటిది ఎంతో ఆదరించే దేశభక్తి గీతాలకు స్థానం లేకపోవడం విచారించదగిన విషయం. ప్రతి సినిమాలో కాకపోయినా తరచుగా అయినా దేశంపై పాటలు రావాలి. యువభారత్‌లో సినిమాకు కీలక స్థానం ఉంది. యువతలో స్వాతంత్ర్య సమర స్ఫూర్తి, సామాజిక చైతన్యాన్ని నరనరాన ఎక్కించే శక్తి సినిమా పాటకుంది. అందుకే మరిన్ని దేశభక్తి గీతాలు తెలుగు సినిమాలో వినిపించాలి. యువత గొంతుక ఆలపించాలి. పాడవోయి భారతీయుడా..!

✦

'లగాన్'లు మనకేవీ...

ఈ అరవై ఏళ్ళలో మన తెలుగు సినిమా సాధించిందేమిటి... సాధించాల్సిందేమిటి... ప్రస్తుతం దేశభక్తిని చాటే చిత్రాలు ఏమైనా రూపొందిస్తున్నామా... అన్న ప్రశ్నలు వేసుకుని గతంలోని మంచిని స్ఫూర్తిగా తీసుకుంటూ నవతరం మెచ్చే చిత్రాలను రూపొందించాలి. మన సినిమాల్లో నవతరానికి స్ఫూర్తి కలిగించేలా దేశభక్తినీ చొప్పించాలి. దేశభక్తి అనగానే స్వాతంత్ర్య సమరమే కథావస్తువు కానక్కరలేదు. ఈ తరం ప్రేక్షకులను ఆలోచింపజేసే విధంగా ఓ 'లగాన్', ఓ 'గదర్', 'చక్ దే ఇండియా' వంటి చిత్రాలను మనమెందుకు రూపొందించలేకపోతున్నాం... అని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాలీవుడ్‌కు దీటుగా సినిమా నిర్మాణం సాగిస్తున్న టాలీవుడ్ ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తుందని ఆశిద్దాం.

మా తుఝే సలాం..

ఏ ఆర్ రహ్మాన్ సినిమాల్లో చాలా బిజీగా ఉన్నపుడే 1997 డిసెంబర్ 9న 'వందే మాతరం' ప్రైవేట్ ఆల్బమ్ విడుదల చేశాడు. అది ఇప్పటి వరకు కూడా భారీగా అమ్ముడుపోయిన నాన్-ఫిల్మ్ ఆల్బమ్‌గా రికార్డు ఉంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్ల అయిన సందర్భంగా ఆ ఆల్బమ్ చేశాడు. జాతి సమైక్యత, దేశభక్తి రగిల్చేలా పాటలుంటాయి. వాటిలోని 'మా తుఝే సలాం..' గీతానికి ఎంతో స్పందన వచ్చింది. జాతీయ గేయమనదగ్గ స్థాయిలో ఉంటుందా గీతం. ఆల్‌టైమ్ పాపులర్ హిట్స్‌లోను, క్లాసిక్స్‌లోను తొలి స్థానాల్లోకి చేరింది. రహ్మానే స్వయంగా ఆలాపించిన ఆ పాట ఉత్తేజితుల్ని చేస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాల్లోనే కాదు పాఠశాల స్థాయి సాంస్కృతిక పోటీల్లోను ఆ పాట ఉండాల్సిందే. మళ్లీ మళ్లీ అంటూ వినాల్సిందే. అంత స్థాయిలో ఆదరణ పొందిన ప్రైవేట్ ఆల్బమ్ మరొకటి లేదు. స్వేచ్ఛ, శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వాలను వివరించేలా పోస్టకార్డులను ఆల్బమ్‌తో పాటు అందించారు. 'మా తుఝే సలాం', 'రివైవల్', 'గురూస్ ఆఫ్ పీస్' గీతాలు జాతీయ పతాకంలోని మువ్వన్నెల్ని సూచిస్తాయి. ఈ ఆల్బమ్ కోసం పాకిస్థాన్ సూఫీ సంగీత విద్వాంసులు నుస్రత్ ఫతే అలీ ఖాన్ కూడా పనిచేశారు. ఇలా దేశభక్తి గీతాలకు ఇరు దేశాల కళాకారులు పనిచేయడం అదే తొలిసారి.



బాంబే, రంగీలా చిత్ర గీతాలకు సాహిత్యాన్ని సమకూర్చిన మెహబూబ్ 'మా తుజే సలాం' గీతంతో పాటు 'తౌబా తౌబా', 'ఓన్లీ యూ', 'గురూస్ ఆఫ్ పీస్' పాటలు రాశారు. బంకించంద్ర చటర్జీ గీతాన్ని 'రివైవల్' పాటగా మలిచారు. రహ్మాన్ దీనికి స్వరాలు కూర్చలేదు. సాంప్రదాయంగా ఉన్నదాన్నే తీసుకున్నాడు. 'తై మన్నె వనక్కమ్'ను వైరాముతు, 'మాసుమ్'ను గుల్జార్, 'ముసాఫిర్'ను టిమ్ కోడీ, కనిక మైయర్ భరత్ రచించారు. 'గురూస్ ఆఫ్ పీస్'కు నుస్రత్ ఫతే అలీ ఖాన్ గొంతు కలిపారు. ఆయన చివరి పాటల్లో ఇదొకటి. సోనీ మ్యూజిక్ సబ్ లేబుల్స్‌పై విడుదల చేసిన భారతీయ ఆల్బమ్‌లో 7 పాటలుంటే, అంతర్జాతీయ ఆల్బమ్‌లో మరో రెండు పాటల్ని జత చేశారు. 28 దేశాల్లో ఈ ఆల్బమ్ విడుదలైంది. విజయ్ చౌక్‌లో ప్రధాని సమక్షంలో రహ్మాన్ ప్రదర్శన ఇచ్చాడు. ఒక్క భారత్‌లోనే తొలి ఏడాదిలో 15 లక్షల కాపీలు అమ్ముడుబోయి చరిత్ర సృష్టించింది. లీడ్ ట్రాక్ అయిన 'మా తుజే సలాం...' పాటకు మరో అరుదైన ఘనత కూడా దక్కింది. 2002లో బీబీసీ వరల్డ్ సర్వీస్ నిర్వహించిన ఓ పోల్‌లో ప్రపంచవ్యాప్తంగా క్లాసిక్స్‌గా నిలిచిన 7000 పాటల్ని తీసుకుని వాటిలో మోస్ట్ ఆల్‌టైమ్ సాంగ్స్‌లో రెండో స్థానం దీనికి దక్కింది. మరో విశేషమేమంటే అత్యధిక భాషల్లో వచ్చిన ట్రాక్‌గా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించింది. భారతీయ గాయకుడైన సాయి "సైకుక్" మనప్రగడ 265 భాషల్లో గానం చేశాడు. అలాగే కోరస్‌తో కలిపి 277 భాషల్లో వినిపించాడు.

ఇమానం రెస్టారెంట్

చైనాకు చెందిన లీ లియాంగ్‌కు విమానాలంటే పిచ్చి. అది ఎంత వరకు వెళ్లిందంటే ఓ పాత బోయింగ్ 737 విమానాన్ని కొని రెస్టారెంట్‌గా మార్చేంతగా. గతేడాది మేలో ఇండోనేషియాకు చెందిన బటావియా ఎయిర్ నుంచి ఆ విమానాన్ని కొని విడి భాగాలుగా చేసి 70 కంటైనర్లలో నాలుగు నెలల ప్రయాణంతో చైనాకు తరలించాడు. ఆ తరహా రెస్టారెంట్ చైనాలో తొలిది కావడంతో లైసెన్సులు, అనుమతులు, మార్పు చేర్పులు ఇలా చాలా ప్రయాసలే పడి అనుకున్నది చేశాడు. వుహాన్ మహానగరంలోని రద్దీగా ఉండే వర్తక ప్రాంతం ఆప్టిక్స్ వ్యాలీ పెడెస్ట్రియన్ వీధిలో విమానాన్ని నిలిపాడు. విమానంలోని కేబిన్ ఏరియాలో రెస్టారెంట్‌ను తెరిచాడు. కాక్‌పిట్‌లో పాసెంజర్ ఫ్లైట్ స్టిమ్యులేటర్‌ను జోడించాడు. ప్రపంచంలోనే అతి ఖరీదైన అత్యంత విస్తుగొలిపే రెస్టారెంట్‌లలో ఒకటిగా దీన్ని పిలుస్తున్నారు.

సాటాన్ సైన్స్



అమెరికాలో పాఠశాల తరగతులు అవగానే కొన్ని క్లబ్‌ల పేరిట ఆధ్యాత్మిక ప్రోగ్రామ్‌ల్లో విద్యార్థుల్ని చేర్పించి చిన్నప్పటి నుంచే నరక భయం-స్వర్గ సౌఖ్యం వంటి భావాలకు బంధీలు చేస్తున్నారని, తర్కం అనే ప్రశ్నే మదిలో మెదిలే అవకాశం ఇవ్వడం లేదని ఓ నాస్తికవాద రాజకీయ సంస్థ అంటోంది. అందుకే వారు సాటానిక్ క్లబ్ పేరిట ఓ ప్రోగ్రామ్ రూపొందించారు. అందులో తర్క శాస్త్రాన్ని బోధిస్తూ సైన్స్‌పై విద్యార్థులకు మక్కువ పెరిగేలా చేయాలని ప్రయత్నిస్తున్నారు. పేరుకు సాతాన్ అని పెట్టారు కానీ ఇక్కడ దాన్ని కొలవడం వంటివి ఏవీ ఉండవు. ఆ పేరుకు ఉన్న ఆకర్షణ, మతాలు నూరిపోసేదానికి వ్యతిరేకత కలసి వచ్చాయంతే అంటున్నారు స్థాపకులు. విద్యార్థులకు మంచి స్నాక్స్ ఇచ్చి ఒక సాహితీ తరగతి, సృజన కార్యక్రమం, సైన్స్ తరగతి, పజిల్ పరిష్కారం, కళా ప్రాజెక్ట్‌లతో విద్యార్థుల ప్రగతికి కృషి చేస్తారు. ఈ ఏడాది నుంచే కార్యక్రమం ప్రారంభించబోతున్న సాటానిక్ క్లబ్ ఆలోచన గొప్పదే.



ఆరు బయట హోటల్

ఓపెన్ ఎయిర్ హోటల్ పేరిట ఈ మధ్య హడావిడి ఎక్కువవుతోంది. ఏ అడ్డు లేకుండా ప్రకృతి ఒడిలో తిష్ట వేయడానికి ఇంత కన్నా గొప్ప ఆతిథ్యం ఏముంటుందని అంటున్నారు. ఒక్క కింగ్‌సైజ్ బెడ్ తప్ప మరేం ఉండవు. స్విట్జర్‌ల్యాండ్ ఆల్ప్స్ పర్వతాల కోనల్లో వీటిని ఏర్పాటు చేసింది నల్ స్టెర్న్ కాన్సెప్ట్ హోటెల్. బాత్‌రూమ్ కూడా ఉండదు. అర్జెంట్ అయితే 10 మైళ్ల దూరంలో ఉండే పబ్లిక్ బాత్‌రూమ్‌ను వాడుకోవాలట. దగ్గరలోని ఓ కలప గదిలో సహాయకుడు ఉంటాడు. వంటాగింటా అంతా అక్కడ చేసి బెడ్ వద్దకే భోజనం తెస్తాడు. చక్కగా తినేసి బెడ్ మీదే పడుకుని ఆల్ప్స్ అందాల్ని అడ్డే లేకుండా ఆస్వాదించొచ్చని అంటున్నారు. అంతకు ముందు 2008లో అదే స్విట్జర్‌ల్యాండ్‌లోని ఓ న్యూక్లియర్ బంకర్‌లో ఇలా ఓపెన్ హోటల్‌ను ఏర్పాటుచేశారు. మరీ అంత ఓపెనైతే కష్టమనుకుంటే నెల బుకింగ్‌లన్నీ హాంఫాట్ చేసేశారు సందర్శకులు. వీళ్లకు ఆరు బయట మన నులక మంచం నిద్దర్లు తెలీవు కాబోసు.



దేవదాసీ టు సీఈఓ

ఒకటో తరగతి చదువుతున్న సీతవ్వని ఓ రోజు కుటుంబ సభ్యులు కొత్త బట్టలతో పచ్చని గాజులతో అలంకరిస్తున్నారు. పండగ వాతావరణంలో ఆ వేడుక చూడటానికి వచ్చిన వారందర్లో తనే ప్రత్యేకంగా కనిపించడం తనకి ఆనందాన్నిచ్చినా ఏం జరుగుతోందో ఏడేళ్ల సీతవ్వకి అర్థం కాలేదు. కొన్నాళ్ల తర్వాత ఆ చిన్నారి దేవదాసీ దురాచారానికి బలైంది. 1990లో కర్నాటక ప్రభుత్వం చొరవతో దేవదాసీ సంకెళ్లను విడిపించుకున్న సీతవ్వ తన లాంటి వారినెందరినో చైతన్య పరుస్తోంది. సమాజంలో మార్పు కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ 'మాస్' అనే స్వచ్ఛంద సంస్థకి సీఈఓగా వ్యవహరిస్తోంది.

భక్తి పేరుతో ఆడవారిని గుళ్లకి అంకితమిస్తూ వారిని దేవదాసీలుగా, బానిసలుగా మార్చిన సాంఘిక దురాచారం 7వ శతాబ్దంలో మొదలైంది. బొట్టుకట్టు పేరుతో ఓ రకంగా దేవునితో వివాహం జరిపినట్టు చేసి బాలికల జీవితాల్ని బలి తీసుకునే ఆ దురాచారం నేటికీ కనిపిస్తూనే ఉంది. కర్నాటకకి చెందిన ఓ కుటుంబంలో మొత్తం తొమ్మిది మంది అమ్మాయిలు జన్మించారు. కుటుంబంలో మగ సంతానం లేకపోవడంతోపాటు ముగ్గురు అమ్మాయిలు చిన్న వయసులోనే అనారోగ్యంతో చనిపోవడం ఆ కుటుంబాన్ని కలవరపరిచింది. పిల్లల్లో ఒకరిని దేవదాసీగా మారిస్తే కుటుంబ పరిస్థితులు చక్కబడతాయని గ్రామదేవత తమ ప్రార్థనలకు బదులిచ్చిందంటూ ఏడేళ్ల సీతవ్వని దేవదాసీని చేయాలనుకున్నారు. అదే సమయంలో సీతవ్వ తండ్రి ఆరోగ్యం కూడా క్షీణించడంతో కుటుంబ పోషణకి ఆమెని దేవదాసీగా చేయాలని పెద్దల నుంచి కూడా ఒత్తిడి వచ్చింది. తొమ్మిది రోజుల పాటు పండుగ వాతావరణంలో జరిగిన ఆ దురాచారంలో సీతవ్వని ప్రత్యేకంగా అలంకరిచారు. తలపై ధాన్యాన్ని కుమ్మరించి ఎరుపు, తెలుపు పూసలతో చేసిన ఓ దండని మత పెద్ద తనకి కట్టడంతో ఆ కార్యక్రమం పూర్తయింది. ఏడో తరగతిలో తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో సీతవ్వకి తను దేవదాసీ అని తనని గ్రామంలో ఒక వ్యక్తికి ఇచ్చేస్తున్నామని తల్లి చెప్పడంతో ఆమె భయపడింది. ఆ రోజే ఒకతను సీతవ్వను తనతో తీసుకెళ్లేందుకు ఆమె తల్లికి కొంత డబ్బివ్వడాన్ని గమనించిన సీతవ్వ, పొలం పనిలో తనూ సాయం చేస్తానని అతనితో తనని పంపొద్దని తల్లిని బతిమిలాడింది. కుటుంబ పరిస్థితుల కారణంగా డబ్బు తీసుకోవడం, మతాచారానికి లోబడి చేసేది లేక తల్లిదండ్రులు సీతవ్వని ఆ వ్యక్తితో పంపించారు. అప్పటి నుండి కుటుంబానికి కావలసిన ఆహారాన్ని అతడే అందించేవాడు. తన ద్వారా సీతవ్వకి ఇద్దరు సంతానం కలిగారు. సీతవ్వ తండ్రి వైద్యంతో కుటుంబ అవసరాలు మరింతగా పెరిగాయి. కొన్నాళ్ల తర్వాత అధిక ధనానికి సీతవ్వని మరో భూస్వామి సొంతం చేసుకున్నాడు. కర్నాటకలోని హోరాకేలి ప్రాంతంలో సీతవ్వని ఉంచాడు. వీరికి ఒక ఆడపిల్ల జన్మించింది. ఊరి చివర ఒంటరిగా జీవించే సీతవ్వ సామాజికంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొనేది. భూస్వామి సీతవ్వని వివాహం చేసుకునేందుకు ముందుకొచ్చినా మతాచారం ఒప్పుకోదంటూ గ్రామస్తులు అడ్డుపడ్డారు. ఊరిపెద్దల వేధింపులూ ఆమెకి తప్పలేదు.

ప్రభుత్వ చొరవతో ముందడుగు

1987లో కర్నాటక ప్రభుత్వం దేవదాసీ వ్యవస్థను నిషేధిస్తూ ఉత్తర్వులని జారీచేసింది. రాష్ట్రంలో ఇలాంటి దురాచారాలని రూపుమాపేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులని చేపట్టింది. వాటిలో పాల్గొనేందుకు కొందరు దేవదాసీలు ముందుకొచ్చారు. అలాంటి వారందరూ (ఎస్‌హెచ్‌జి) స్వయం సహాయక బృందంగా ఏర్పడి వివిధ గ్రామాల్లో దేవదాసీల స్థితిగతులపై ప్రసంగించేవారు. ప్రతి వారం జరిగే అవగాహన సదస్సులో పాల్గొన్న సీతవ్వ తనతో పాటు బానిసలుగా బతుకుతున్న ఎంతోమంది దేవదాసీల జీవితాలలో మార్పు తేవాలనుకుంది. సామాజికంగా దేవదాసీలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రసంగించడంతో పాటు కెఎస్‌డబ్ల్యుడిసి (కర్నాటక స్టేట్ ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిర్వహించే దేవదాసీ పునరావాస కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనేది.

ఊహించని మార్పు

కెఎస్‌డబ్ల్యుడిసి చొరవతో దేవదాసీల జీవన విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్న సమయంలో బెలగాం జిల్లాలో కెఎస్‌డబ్ల్యుడిసి వైదొలగడంతో ఎస్‌హెచ్‌జి బృందాలకి కొంత చేయూత లోపించింది. అయితే జట్టు సభ్యుల్లో కొందరు సొంత సంస్థని స్థాపించాలనే ప్రతిపాదన చేయడంతో 'మాస్' (మహిళా అభివృద్ధి మట్టు సంరక్షణా సమస్థ)ని ప్రారంభించారు. దేవదాసీ వ్యవస్థని నిర్మూలించేందుకు కృషిచేస్తున్న బోర్డు సభ్యులు సీతవ్వని 'మాస్' సంస్థకి డైరెక్టర్‌గా ఎంచుకున్నారు. మహిళా, బాలల హక్కులు, సుఖ వ్యాధులు, బాలల మానసిక స్థితి, ఆర్థిక నిర్వహణ, న్యాయ నిర్వహణ, ఎన్‌జిఒ నిర్వహణ వంటి అనేక విషయాలపై హుక్కెరి, చిక్కోడి, రైబాగ్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలని నిర్వహిస్తూ, ఎస్‌హెచ్‌జి బృందాలకి బ్యాంకు రుణాలతోపాటు న్యాయపరమైన సలహాలందించడం కోసం ఉచితంగా 'లీగల్ ఎయిడ్'ని ప్రారంభించింది. 'మాస్' సంస్థని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్న సీతవ్వను 2012లో మాస్ సంస్థకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎంపిక చేయడంతో యాజమాన్య వ్యవహారాలతో పాటు దేవదాసీలకు చట్టపరమైన రక్షణ అందేలా కృషిచేస్తోంది. ఇదీ సీతవ్వ కథ. దేవదాసీ నుంచి సీఈఓగా బతుకును మార్చుకుని.. తనలాంటి మరో మహిళ కన్నీళ్లను తుడుస్తున్న మానవి కథ.

- శర్వాణి

మన జెండా చరిత్ర

మన జాతీయ జెండా ఏ ఒక్కరోజో ఏ ఒక్కరో రూపొందించింది కాదు. పతాకానికి కూడా నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది.

- మొదటిసారి 1904-06 మధ్యకాలంలో స్వామి వివేకానంద శిష్యురాలైన ఐరిష్ మహిళ సిస్టర్ నివేదిత దేశ పతాకాన్ని రూపొందించారు. ఈ జెండాలో ఎరుపు, పసుపు రంగులుండేవి. ఎరుపు పోరాటానికి, పసుపు విజయానికి చిహ్నంగా జెండాపై వందేమాతరం అని బెంగాలీ నినాదముండేది. జెండాపై బలానికి చిహ్నంగా వజ్రాయుధం స్వచ్ఛతకు చిహ్నంగా కమలం ఉండేవి.
- ఆ తరువాత 1906లో మరో జెండా కలకత్తాలోనే తయారైంది. అది మూడు రంగుల జెండా. నీలం రంగులో ఎనిమిది నక్షత్రాలు, ఎనిమిది బ్రిటిష్ ఇండియా ప్రావిన్స్‌లకు చిహ్నంగా ఎరుపు రంగులో సూర్యుని గుర్తు, చంద్ర వంక, నక్షత్రం గుర్తులు ఉండేవి. మధ్యలో ఉన్న పసుపు రంగులో వందేమాతరం అని దేవనాగరి లిపిలో నినాదం ఉండేది.
- అదే సంవత్సరం కలకత్తాలో మరో జెండా తయారయ్యింది. కలకత్తా వందే మాతరం ఉద్యమానికి కేంద్రం కావడంతో జాతీయ భావాల మాట మెండుగా ఉండేవి. 1906 ఆగష్టు 7న మొదటిసారిగా కలకత్తాలోని పార్సీ బగన్ స్క్వేర్ ప్రాంతంలో సురేంద్రనాథ్ బెనర్జీ జెండా ఎగరేశారని శచీంద్ర ప్రసాద్ బోస్, సుకుమార్ బెనర్జీలు కూడా జెండా తయారు చేశారని అంటారు. కలకత్తా జెండా లేదా కమలం జెండా అని కూడా అంటారు. ఆకుపచ్చ, పసుపు, ఎరుపు రంగులలో సూర్య చంద్రులు, కమలం గుర్తులలో ఉండేది.
- 1907లో పార్సీ మహిళ మేడం భికాజీ రుస్తుం కామా జెండా తయారు చేశారు. ఇదే బెర్లిన్ కమిటీ జెండా అని కూడా అంటారు. మొదట పారిస్‌లో ఆ తరువాత 1907 ఆగస్టు 22న జర్మనీలోని స్టట్‌గార్ట్‌లోను కొంతమంది సోషలిస్టు రివల్యూషనరీలతో కలిసి 2వ ఇంటర్నేషనల్ సోషలిస్టు కాంగ్రెసు సందర్భంగా ఆవిష్కరించారు. ఇందులో కూడా కాషాయం, పసుపు, ఆకుపచ్చ రంగులున్నాయి.
- 1917లో బాల గంగాధర్ తిలక్, అన్నీ బీసెంట్‌లు హోమ్‌రూల్ లీగ్ ఉద్యమ చిహ్నంగా రెండు జెండాలు కొద్ది తేడాతో రూపొందించారు. ఒక మూలన బ్రిటిషులోని ఒక జాక్ ఉండి సప్తరుషి మండలానికి చిహ్నంగా ఏడు నక్షత్రాలతో ఎరుపు, ఆకుపచ్చ గళ్ళతో ఉండేది.
- నేతాజీ స్థాపించిన అజాద్ హింద్ ఫౌజ్ చేతబూనిన పతాకంలో మువ్వన్నెల మధ్య పులి గుర్తు ఉంటుంది.



ఆగస్టు 15 జెండా పండుగ వచ్చిందంటే చాలు వ
మిన్నంటుతాయి. యావద్దేశం ఉత్సవ వాతావరణంలో
నిలిచిన జెండా! ఎవరెస్టు శిఖరంపై రెపరెలాడిన జెం
జాతీయ పతకానికి తుది రూపునిచ్చింది హైదరాబాద్
ఆలోచనకందని చరిత్ర జెండాకుంది.

జాతి సమైక

మువ్వన్నె

మన దేశ పతాకానికి తుది రూపునిచ్చినవారు సురయ్యా. ఆమె భర్త బద్రుద్దీన్ హుస్సేన్ త్యాబ్జీ 1932 ఐసిఎస్ (ఇండియన్ సివిల్ సర్వీస్) బ్యాచ్ అధికారి. రాజ్యాంగ సభ డిప్యూటీ సెక్రెటరీ గా పనిచేశారు. భారత జాతీయ కాంగ్రెసుకు 3వ అధ్యక్షుడు గానూ బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగాను పనిచేసిన బద్రుద్దీన్ త్యాబ్జీ మనవడు. డా॥ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పడ్డ రాజ్యాంగ సభ అశోకుని ధర్మ చక్రంతో కూడిన జాతీయ జెండాను 1947 జులై 22న ఆమోదించింది. అదే రోజు రాత్రి కాబోయే ప్రధాని నెహ్రూ కారుపై ఎగిరింది.అంతకు ముందు రాట్నం గుర్తుతో ఉన్న భారత జాతీయ కాంగ్రెసు జెండాపై అశోకుని ధర్మ చక్రం ఎలా వచ్చిందనే విషయంపై.. బద్రుద్దీన్ త్యాబ్జీ తన 86వ ఏట 1996 జనవరి 26న ఒక పత్రికలో ఇంటర్వ్యూ ఇచ్చారు. దాని సారాంశం.. భారత జాతీయ కాంగ్రెసు మువ్వన్నెల జెండాను మన జాతీయ జెండాగా ఉండాల్సింది అయితే జెండాలో ఉన్న రాట్నం గుర్తు అనువుగా లేదని, జెండా ఎగరేసినప్పుడు రాట్నం గుర్తు ఒక వైపు మాత్రమే సరైన దిశలో కనిపిస్తుందని, అలాగే స్వతంత్ర భారత్ ఆర్థిక విధానాలను రాట్నం గుర్తు ప్రతిబింబించలేదని ఆ స్థానంలో అశోకుని ధర్మ చక్రం ఉండాలని అభిప్రాయపడ్డారు. అదే విషయం రాజ్యాంగరభా ఛైర్మన్‌గా ఉన్న రాజేంద్రప్రసాద్‌కు విన్నవిస్తే అందుకు ఆయన చాలా సంతోషించి, బాపూ(గాంధీజీ)కి తెలియ జేయమన్నారు. ఆ ప్రకారమే ఆయన గాంధీజీ నివాసానికి వెళ్లి చెప్పారు. ఆయన స్పందించారు. అయితే ఒక మోడల్ తయారు చేసి చూపించమన్నారు. వెంటనే త్యాబ్జీ కన్నాట్ ప్లేస్‌కు వెళ్ళి ఒక గుడ్డ కొని ఆయన భార్య సురయ్యాకి ఇచ్చి జెండా తయారు చేసి ఇవ్వమని కోరారు. సురయ్యా ఆర్టిస్ట్ కూడా. ఆమె అశోకుని ధర్మ చక్రంతో కూడిన మూడు రంగుల జెండా తయారు చేసి ఇచ్చారు.

అదే జెండా పట్టుకుని వెళ్ళి గాంధీ
సంతృప్తి పడి తన ఆమోదం తెలి
బద్రుద్దీన్ త్యాబ్జీల మేథో కళా ఫలి

పింగళి అంది

1921లో జెండా వెంకయ్యా
పెనుమర్రు వాసి మన పింగళి వె
ఎరుపు, ఆకుపచ్చ వర్ణాలతో ఉండె
కాంగ్రెసు కమిటీ సమావేశాల సం
వెంకయ్య.. గాంధీజీ సలహాతో ఎ
కూడిన జెండా తయారు చేశారు.
హిందూ, ముస్లింలకు ప్రాతినిథ్యం
మైనారిటీ మతస్తులకై తెలుపును
చేర్చారు. హన్స్‌రాజ్ రాట్నం గుర్తు
అలిండియా కాంగ్రెసు కమిటీ ఈ
కారణం మతం ప్రస్తావన ఉండడ

అన్నీ బిసెంట్

సురయ్యా

...ువ్వన్నెల జెండా రెపరెపలు, జాతీయ గీతాలాపనలు, జైహింద్ నినాదాలు
... తేలియాడుతుంది. అయితే దేశ ప్రజల స్వాతంత్ర్యానికి, సార్వభౌమత్వానికి చిహ్నంగా
...డా! తిరంగా జెండా రూపకల్పనలో నలుగురు స్త్రీమూర్తులు ఉన్నారంటే నమ్ముతారా!
వాసి సురయ్యా బద్రుద్దీన్ త్యాబ్జీ అంటే నమ్మగలరా! నడుస్తున్న కాలానికి పట్టని,

...్యతా చిహ్నం

...ల జెండా

...జీకి చూపించగా ఆయన ...ారు. ఆ విధంగా సురయ్యా ...తమే మన జాతీయ జెండా.

...ంచిన జెండా

...ా పేరొందిన కృష్ణా జిల్లా భట్ల ...ంకయ్య తయారు చేసిన జెండా ...ది. బెజవాడలో ఆలిండియా ...దర్భంగా గాంధీజీ శిష్యుడైన ...ుపు, ఆకుపచ్చ రంగులతో ...ఎరుపు, ఆకుపచ్చ రంగులు ...వహిస్తాయని, మిగిలిన ...్వదేశీకి నిదర్శనంగా గాంధీజీనే ...ు చేర్చాడు. అయితే ...జెండాను ఆమోదించలేదు. ...మే. మొత్తం మీద జెండాల రూపకల్పనలో ఎరుపు, ఆకుపచ్చ రంగులు హిందూ ముస్లిం ఐక్యత అంతర్లీనంగా ఉంటూనే ఉంది. ఈ జెండానే 'స్వరాజ్య జెండా'గా పేరు పొందింది. 13 ఏప్రిల్ 1922న జలియన్‌వాలా బాగ్ దురంతానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ వలంటీర్ల మొదట ఇదే జెండాను ఎగరవేశారు. 1931లో కాషాయ జెండాకు ఒక మూలన రాట్నం గుర్తుతో ఒక జెండా తయారయ్యింది. అది కూడా కాంగ్రెసు కమిటీ ఆమోదించలేదు. మొత్తం మీద మత భావాలు, జెండాల రంగులకి ఇచ్చిన పలు వ్యాఖ్యానాలు ఉద్రికత్తలకు దారి తీశాయి. చివరికి మత ప్రమేయం లేకుండా ప్రజల ఐక్యతా చిహ్నంగా మూడు రంగుల జెండాను 1931లో కరాచి కాంగ్రెస్‌లో ఆలిండియా కాంగ్రెసు కమిటీ ఆమోదించింది. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల జెండా మధ్యలో స్వదేశీ రాట్నం గుర్తుతో ఈ జెండా ఉంటుంది.

- ఎస్. పుణ్యవతి

జెండాకు అర్థం

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ తాత్త్విక దృష్టితో.. కాషాయం ధైర్యానికి, ప్రజల త్యాగ నిరతికి.. తెలుపు సత్యం, న్యాయం, సౌశీల్యానికి.. హరిత వర్ణం భూమికి, ప్రజల జీవితానికి ఉన్న సంబంధానికి, ప్రజల సౌభాగ్యానికి చిహ్నమని.. ధర్మ చక్రం న్యాయానికి, సమతకి, ధర్మానికి నిదర్శమని వ్యాఖ్యానించారు. పైవిధంగా జెండాకున్న ఉదాత్త చరిత్ర ఒక భాగమయితే. దేశ ప్రజల సమైక్యతకు, సమగ్రతకు ప్రజల ఆకాంక్షలకు చిహ్నంగా నిలిచింది.

జెండాలో ధర్మ చక్రం ఎలా వచ్చింది?

స్వతంత్ర భారత్‌కి ప్రజల స్వేచ్ఛా చిహ్నంగా తన స్వంత జెండా అవసరమని భావించి రాజ్యాంగ సభ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన 1947 జూన్ 23న ఒక కమిటీ వేసింది. జులై 14న కొన్ని తర్జన భర్జనలు జరిగాయి. బద్రుద్దీన్‌తోపాటు సురయ్యా కూడా తమ వాణి వినిపించారని అంటారు. వీరిద్దరూ కాంగ్రెసు జాతీయ సభ్యులే. స్వాతంత్ర్యం కోసం అనేక రాజకీయ అభిప్రాయాలు కలవారు పోరాడారాని ఒక పార్టీ జెండానే జాతీయ జెండాగా నిర్ణయించడం సరిగాదని సురయ్యా చెప్పారని అంటారు. అయితే స్వరాజ్య కాంక్షకు ప్రతీకగా ఉన్న మూడు రంగుల జెండా ఉండాలని రాట్నం బదులుగా అందరికీ ఆమోదయోగ్యంగా బుద్ధుని బోధనలు అయిన సత్యం, ధర్మం, న్యాయం ప్రబోధించే అశోకుని ధర్మ చక్రం అన్ని విధాల యోగ్యమని ఆమె చెప్పారని తెలుస్తోంది. జులై 17న ఆమె స్వయంగా జెండా తయారు చేశారని... అదే జులై 22న రాజ్యాంగ సభ ఆమోదించిందని... ఆ జెండానే కాబోయే ప్రధాని నెహ్రూ తన కారుకు అదే రోజు రాత్రి అలంకరించారని మరి కొందరు చెబుతున్నారు.



కలకత్తా జెండా



భికాజీ జెండా



పింగళి జెండా



1931 మోడల్



నెలవంక పాదాలు

చదునైన పాదాలు
అకుంఠిత దీక్షతో
తమను తాము
నెలవంకలా
తీర్చి దిద్దుకున్నాయి
రెండు చేతుల నడుమ
ఆప్యాయంగా పెరిగిన మొక్క
ఒక పెద్ద కలను పూసింది
అయిదు దశాబ్దాల
నిరీక్షణ తరువాత
నా దేశం తలుపులు
తెరుచుకున్నాయి
గుమ్మంలోంచి తొంగి చూస్తున్న
వెలుగు కిరణం
భూమి చివరంచు దాకా
విస్తరించింది
నెలవంక ఒలింపిక్ రింగులా
రూపాంతరం చెందుతుంది
వేసిన అడుగు
వెనుదిరగని ప్రయాణం
వేదికకు దగ్గర చేస్తుంది
రెక్కలు చాచి ఎగురుతున్న
నా దేశపు సీతాకోక చిలుక
ఆ కలల వేదికపై
తప్పక రంగులు పోతుంది
సగర్వంగా ప్రకాశిస్తున్న
ఈ దీపం వెలుగులో
నా దేశపు కీర్తి పతాకం
తప్పక రెపరెపలాడుతుంది
నమోదయిన చరిత్ర
మరో కొత్త చరిత్రకు
తప్పక దారి వేస్తుంది
ఆమె నెలవంక పాదాలను
దేశమంతా ముద్దాడే రోజు
ఎంతో దూరంలో లేదు....!

- చిన
7093075453

ఐక్యతా రాగం

అరేబియా సముద్రం
బంగాళాఖాతం
హిందూ మహాసముద్రం
హిమాలయం మధ్య
పర్యటన సాగుతూంది
ఎన్ని భాషలు మతాలు
వేషాలు మాండలికాలు
ఒకరిపై ఒకరి స్వారీ
ఒకరిపై ఒకరి అంబారీ
ఊరేగే పల్లకీలు
భుజాలు మార్చుకుంటున్న
బోయీలు
సరిహద్దుల లక్ష్మణ రేఖలు
ఆంక్షల కంచెలు
ఎంత అస్పృశ్యత ఎంత విరాగం !
గాయకుడు మోహన రాగమైతే
నిలకడ మేఘాలు
కదలికలౌతాయి
పాట కోసం పరుగులు తీసి
అలలు
గట్టున ఆలకిస్తాయి
పరమతస్తుడి కంఠంలో
కోకిల తిష్టవేసిందని
ఇతర మతస్తుడి ఈర్ష్య!
చిత్రకారుడి చిత్రపటాలు
ముగ్గురమ్మలు త్రిమూర్తులు
అనార్కలి క్లియోపాత్ర
ఎంకి నాయుడు బావ
భువన భవనపు బావుటాలై
ప్రశంసల జల్లులో తడుస్తున్నాయి
చిత్రకారుడు తమ వర్గం
కానందుకు
ప్రత్యర్థుల అప్రీతి!
కవీంద్రుడు కమలాప్తుడై
సందులు గొందులు తిరిగి
విహంగ వీక్షణమై
అట్టడుగు అస్పృశ్యుల గాథల్ని
అక్షరీకరించినందుకు
సాహితీ సామ్రాట్టును చేసి
వింజామరలు వీస్తుంటే
వర్ణమదాంధుల
అపరాగ కేళీ వివక్ష!
సంచారం సాగుతూంది
ఎన్ని రూపులు ఒక్క మనసుకు
ఎన్ని దారులు ఒక్క నడకకు
ఎన్ని మాటలు ఒక్క జిహ్వాకు

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

ఒక ప్రయివేటు కళాశాలలోని అధ్యాపకుని మనసులో తట్టిన చిన్న ఆలోచనే ఒడిశా రాష్ట్రవ్యాప్తంగా గుట్కాపై పోరాటానికి నాంది పలికింది. ఒక వ్యక్తిగా ప్రారంభించిన గుట్కా వ్యతిరేక ఉద్యమం అనతి కాలంలోనే మహోద్యమంలా, సముద్రంలా విస్తృతమైంది. గుట్కా మహమ్మారి బారినపడి కళ్లెదుటే ఎన్నో కుటుంబాలు కకావికలం కావడం చూసిన యువ లెక్చరర్ మహమ్మద్ ఇమ్రాన్ అలీనే ఆ ఉద్యమకారుడు.

గుట్కాపై ఒక్కడి విజయం

ఒడిశాలోని భద్రక్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ సోషియాలజీ (సామాజిక శాస్త్రం)లో పట్టభద్రుడు. పీజీ చేయడానికి విద్యా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకర్లు నిరాకరించడంతో నాటి రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంకు రుణం ఇప్పించాలని వినతిపత్రం పంపించాడు. దానికి స్పందించిన రాష్ట్రపతి ఇమ్రాన్‌కు వెంటనే విద్యారుణం ఇవ్వాలని మార్గనిర్దేశకం చేశారు. దాంతో బ్యాంకు రుణం మంజూరు చేసింది. దేశ ప్రథమ పౌరుడు సామాన్యుని లేఖకు అలా బాధ్యతగా స్పందించిన తీరు చూసి ఇమ్రాన్ ప్రేరణ పొందాడు. సమాజానికి ఏదో ఒక మంచి పని చేయాలనే ఆలోచన, స్ఫూర్తిని రగిలించింది. రోజుకొక రూపాయి, ఒక గంట శ్రమను దేశం కోసం కేటాయించాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాడు ఇమ్రాన్.

చిరు జీవితాల్లో...

తను ఎంఏ సోషల్ వర్క్ చదువుతున్న కాలంలో ఒక రోజు భువనేశ్వర్‌లోని శాంతిపలి అనే మురికివాడను సందర్శించాడు. ఆ సమయంలో అక్కడ పది సంవత్సరాల వయస్సున్న పిల్లలు, బాల కార్మికులు పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారడాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. ఈ విషయంపై ఇమ్రాన్ అధ్యయనం చేయగా తల్లిదండ్రుల అజ్ఞానం, తేలికగా మార్కెట్లో పొగాకు ఉత్పత్తులు అందుబాటులోకి రావడం కారణమని గ్రహించాడు. చిరుప్రాయంలో గుట్కా వ్యసనాలకు బానిసైన వీరు భవిష్యత్తులో మద్యం, ఇతర వ్యసనాలకు బానిసవుతారని గ్రహించాడు. గుట్కా నమలడం వల్ల అనేక మంది క్యాన్సర్ వ్యాధిన పడుతున్నారని గ్రహించిన ఇమ్రాన్ గుట్కాకు వ్యతిరేకంగా సామాజికోద్యమం చేపట్టాలని నడుం బిగించాడు. ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎదురయ్యే పరిణామాల గురించి 'బ్లడీ గుట్కా' అనే పేరుతో ఒక పుస్తకాన్ని స్వీయ ప్రచురణ చేశాడు.

స్నేహితులతో కలిసి మురికివాడ వాసులకు పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాడు. ఈ క్రమంలో ఇమ్రాన్‌కు అనేక బెదిరింపులు, అవమానాలు ఎదురైనప్పటికీ మొక్కవోని దీక్షతో ముందుకు సాగిన సాహసి. స్వచ్ఛంద ప్రచారంలో భాగంగా భువనేశ్వర్‌లోని కొందరు యువకులతో కలిసి 'నషా ముక్తి యువ సంకల్ప్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలకు , మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. నగరమంతటా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఒక ప్రణాళిక ప్రకారం న్యాయపోరాటం వైపు అడుగులు వేశారు. ఒడిశా రాష్ట్ర సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్ రాష్ట్రంలో పాల కేంద్రాలు నిర్వహిస్తోంది. ఆ కేంద్రాలు పొగాకు, ధూమపానం నిలయాలుగా మారటాన్ని గమనించారు. వాటిలో పాల అమ్మకం కంటే పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇమ్రాన్, అతని స్నేహితుడు జితేంద్రకుమార్ సాహూతో కలిసి ఒడిశా హైకోర్టులో పాల కేంద్రాల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిషేధం కోరుతూ పిల్ దాఖలు చేశారు. సామాజిక అంశంపై కోర్టును ఆశ్రయించిన ఇమ్రాన్‌కు సీనియర్ హైకోర్టు న్యాయవాది బైరాన్ త్రిపాఠి ఈ కేసును ఉచితంగా వాదించేందుకు ముందుకొచ్చారు. 2011లో ఒడిశాలో పాల కేంద్రాలలో పొగాకు ఉత్పత్తుల మీద నిషేధం విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

రెట్టించిన ఉత్సాహంతో.. గుట్కా అమ్మకాల వ్యాపారం నిషేధం ప్రకటించిన విషయాలన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక మార్గాలు ఎంచుకున్నాడు. ఒడిశాలో మిగతా వాటితో పోలిస్తే స్మోక్‌లెస్ పొగాకు సేవనం వల్ల 40 శాతం మంది క్యాన్సర్ ప్రమాదంలో పడే అవకాశముంది. మొత్తం జనాభాలో 43 శాతం పైగా ఏదోక రూపంలో స్మోక్‌లెస్ పొగాకు సేవనానికి ఖర్చు చేస్తున్నారు. ఇమ్రాన్ ప్రచారం వల్ల సానుకూల ప్రభావం కనబడకపోవడంతో హైకోర్టులో మరో పిల్ దాఖలు చేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహాయం చేయడానికి ముందుకొచ్చింది. కోర్టులో వీరి బృందం మరోసారి విజయం సాధించడంతో 2013 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిషేధం అమలులోకొచ్చింది.

ప్రజల్లో అవగాహన కోసం 'సలాం జీవన్' అనే ఒడియా డాక్యుమెంటరీని తయారుచేశాడు. ఈ ఉద్యమంలో ఎక్కువమందిని భాగస్వాములు చేసేందుకు వాట్సాప్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఆచార్య హరిహర్ ప్రాంతీయ క్యాన్సర్ సెంటర్ నోటి క్యాన్సర్ రోగులకు సహాయం చేసేందుకు ఇమ్రాన్ అతని స్నేహితుడు బి.నాయక్ అనే డాక్టర్ ద్వారా సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. పత్రికా సంపాదకులు, వాయిస్-ఓవర్ కళాకారులు, కెమెరామెన్‌లు ఆయనకు తోడుగా నిలిచారు. గుట్కా నిషేధంపై సినిమా థియేటర్లలోను స్వచ్ఛందంగా డాక్యుమెంటరీని ప్రదర్శించారు థియేటర్ యజమానులు.

- కుమారి.ఎన్

అంకురం మొలకెత్తే వేళ

- గంగాధర్ వీర్ల
9700423737

మరో కొన్ని గంటల్లో పుట్టి పెరిగిన ఊరుని కళ్లారా చూడబోతున్నాననే ఫీలింగ్ అనుభవ్‌కి ఊపిరాడనీయడంలేదు. కన్న ఊరిని తలచుకుంటేనే గుండెంతా బరువుగా మారుతోంది. అది గుండెల్ని పిండుతున్న బరువు కాదు. సంతోషంతో నిండిన బరువు. అప్రయత్నంగానే చేతిలోవున్న సెల్‌ఫోన్‌లోని ఫొటోగ్యాలరీపై చేతివేళ్ళు సుతారంగా కొన్ని అపురూపమైన జ్ఞాపకాల కోసం వెదుకుతున్నాయ్. ఆ జ్ఞాపకపు ఛాయల్ని ఒక్కొక్కటిగా మరోసారి గుర్తు చేసుకుంటుంటే అనుభవ్ కళ్ళల్లో చెప్పలేనంత వెలుగు. ఆరోజున అమ్మ మాట్లాడిన మాటలు గుర్తొచ్చాయి.

"రేయ్ పెద్దోడా.. అమెరికాలో మన తెలుగోళ్ళ భోజనం దొరకదంట కదా.. మరి బయటకెళ్లినప్పుడు ఆకలేత్తే.. ఏం తింటావ్?" అమాయకంగా అడిగింది అనుభవ్ తల్లి అన్నపూర్ణమ్మ. " అమెరికాలో కూడా మన అన్నమే తినమంటావా అమ్మా!" నవ్వుతూ అన్నాడు అనుభవ్.

" అన్నం కాక మరేం తింటార్రా నాయినా?" అని అన్నపూర్ణమ్మ అశ్చర్యం వ్యక్తం చేస్తుండగా " ఏదో గడ్డో, పరకో తింటారు లేవే.. పొద్దు పొద్దున లేచామా, తెల్లారిందా? తిన్నామా? పడుకున్నామా? మళ్ళీ తెల్లారిందా.. తిందామా? అనే తిండి యావలోనే బతికేయరు.. టైమ్‌కి ఏద్దొరికితే అదే తిని కట్టపడతారు. నువ్వూరికే ఆ పెస్న.. ఈ పెస్న అడిగి పెద్దోడ్ని వూరికే తికమక పెట్టమాక " అంటూ అనుభవ్ తండ్రి రఘురామయ్య తనకు అంతో ఇంతో తెలిసిన అమెరికా పద్ధతుల గురించి భార్యకు చెప్పబోయాడు.

"మీరు మరీనూ.. మనమంతా తిండిపోతోళ్ళు ం. ఆళ్ళంతా తిండిగిండీ మానేసి కట్టపడేటోళ్ళూనూ.. భలే చెప్తావయ్యా.. ఏం మనం ఈడ కట్టపడటంలే. అంతెందుకు నీ సంగతే తీసుకుందాం. నా పెళ్ళయిన కానించి ఇప్పటిదాకా ఏ పూటైనా ఇంటి పట్టునున్నావా? ఎప్పుడు చూసినా? నా పొలం, నా పంటలు, నా ఎడ్లు, నా గేదెలు అంటూ రోజంతా గొడ్డులా కట్టపడతానే ఉంటావు కదా? అది కాదా కట్టం. అయినా ఇంతా నువ్వు కట్టపడుతుంది.. మనింట్లో వోళ్ళందరికీ నాలుగేళ్ళు నోట్లోకెళ్ళాలనే కదా?!" అని అన్నపూర్ణమ్మ అనేసరికి రఘురామయ్యతో సహా అనుభవ్ కూడా బిత్తరపోయాడు.

మనల్ని మనమే తిండిపోతోళ్ళమని కించపరుచుకోవడం అన్నపూర్ణమ్మకు నచ్చలేదు. భార్య అలా స్పందిస్తుందని రఘురామయ్య కూడా ఊహించలేదు. ఆమెకు కుటుంబం పట్ల, పుట్టిపెరిగిన సమాజం పట్ల వున్న ప్రేమను చూసి లోపల్లోపల్లే సంబరపడ్డాడు.

"నాన్నోయ్ ఎవరినైనా తక్కువ అంచనా వేయిగానీ అమ్మను మాత్రం వేయమాక.. ఆ మాటకొస్తే నీకంటే అమ్మే ఎక్కువ కష్టపడతుంది. నువ్వు పొద్దంతా పొలం పనులు చక్కదిద్దుకుంటున్నావంటే.. అందులో అమ్మ సాయం కూడా చాలా ఉంది కదా.. ఇలా లెక్కేసుకుంటే మనం, మన జనాలు కష్టం కూడా ఎవరికీ తక్కువ కాదు" అంటూ తల్లి మాటకు వత్తాసు పలికాడు అనుభవ్.

"బానే ఉందిరా మీ ఇద్దరి వరస. నువ్వు ప్రెయాణం హడావుడిలో ఉన్నావ్ కదా.. అది

ఊరికే ఇసిగిత్తా వుంటే దారిమళ్లిద్దామని కలగజేసుకున్నాగానీ.. ఇలా మీ ఇద్దరూ నా మొహం వాచేలా చివాట్లుపెడతారంటే.. అస్సలు మీ మధ్యలోకొచ్చేవాడ్నేకాదు" బుంగమూతి మొఖంపెట్టి అన్నాడు రఘురామయ్య.

" చూడవే అమ్మా.. పాపం నాన్న అలిగినట్టున్నాడు. అలక తగ్గాలంటే నువ్వు చిక్కని పాలేసి మళ్ళోసారి టీ పెట్టాల్సిందే" అంటూ తండ్రి బుంగమూతిపై కాస్తంత నవ్వు తెప్పించే ప్రయత్నం చేశాడు అనుభవ్.

"మీ నాన్నకు ఈ వయసులో బుంగమూతొక్కటే తక్కువ. నువ్వు ఈ మధ్య ఇంట్లో ఉంటున్నావు కాబట్టి సరిపోయింది గానీ, లేదంటే ఈపాటికి నాలుగైదు మార్లయినా అలిగేవారు. చీటికీమాటికి ఆయనకి ఇలాంటి మూతిబిగింపులు అలవాటేలే.." అంటూ భర్తవంక ఓరగా చూస్తూ మరింత ఉడికించబోయింది అన్నపూర్ణమ్మ.

పెళ్ళయి ఇన్నాళ్ళయినా అమ్మానాన్నలిద్దరూ ఇప్పటికీ చిన్నపిల్లల్లా పోట్లాడుకుంటూనే ఉంటారు. ఆ పోట్లాటల్లో ఒకరి పట్ల ఒకరికి ఎంత ప్రేమ, అభిమానముందో అనుభవ్‌కి బాగా తెలుసు.

"నాన్నకు ఇల్లు, పొలం తప్ప మరే ధ్యాస ఉండదు. అమ్మకు నాన్న, ఇల్లు, పిల్లలు తప్ప మరో వ్యాపకం లేదు. ఎంతో పుణ్యం చేసుకుంటేగానీ ఇలాంటి అమ్మానాన్నలు దొరకరు" అని మనసులోనే అనుకుని తల్లితండ్రులకు పాదాభివందనం చేసుకున్నాడు అనుభవ్.

అనుభవ్ ఆ ఇంట్లో పెద్దకొడుకు. రెండోవాడు మనోజ్. డిగ్రీ వరకూ చదువుకున్నాడు. చిన్నప్పటి నుంచే తండ్రికి సాయంగా ఉంటున్నాడు. డిగ్రీ వరకూ చదువుకున్నా గానీ మనోజ్‌కి వ్యవసాయంపట్లే ప్రేమెక్కువ. రఘురామయ్యకు ఇపుడు సరిగ్గా అందొచ్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే కన్నతండ్రి ఇప్పటిదాకా పడిన కష్టం తెలికవ్వడం కోసం తనో భుజం కాస్తున్నాడు. కాని, పెద్దకొడుకైన అనుభవ్ లక్ష్యం వేరు. చేరాల్సిన గమ్యం వేరు. అందుకే చదువుపైనే శ్రద్ధపెడుతూ ముందుకు సాగుతున్నాడు

అనుభవ్ స్కూల్ స్థాయి నుంచే చదువులో జెమ్. ఊర్లోవున్న గవర్నమెంట్ స్కూళ్లోనే పదవ తరగతి వరకూ చదివాడు. జిల్లాస్థాయిలో అందరికంటే ఎక్కువ మార్కులు రావడంతో కార్పోరేట్ కాలేజ్‌వాళ్ళు వెదుక్కుంటూ మరీ వచ్చి మనోజ్‌కి ఫ్రీ సీట్ ఇచ్చారు. మంచి ర్యాంక్ రావడంతో ఎంబీబీఎస్‌లో చేరడం తేలికయ్యింది. కొద్దిపాటి ఖర్చులు మినహా పెద్దగా ఆర్థికభారం లేకుండానే ఎంబీబీఎస్ పూర్తయ్యింది. తర్వాత అమెరికా యూనివర్శిటీలో ఎంఎస్ చేసే ఛాన్స్ వచ్చింది. అమెరికా వెళ్లడానికి, ఉండటానికి కొంత ఖర్చు చేయగలిగితే ఎమ్మెస్ పూర్తి చేసి రావొచ్చు. కుటుంబంపై ఆర్థిక భారం పడ్డం ఇష్టంలేక అమెరికా చదువు వద్దనే అనుకున్నాడు మనోజ్. దానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. ఎలాగైనా వెళ్ళాల్సిందే అని తీర్మానించారు. అందుకు కావాల్సిన డబ్బులు సమకూర్చడంతో మనోజ్ అమెరికాలో అడుగుపెట్టాడు.

మనోజ్ చదువు కోసం రెండేళ్ళు అమెరికాలోనే ఉన్నాడు. మధ్యలో యూనివర్సిటీకి సెలవులొచ్చినా అదనపు ఖర్చులు చేయడం ఇష్టంలేక ఇండియా రాలేదు. చదువు పూర్తయ్యింది. కావాలనుకుంటే అక్కడే ఉండిపోవొచ్చు. క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా జాబ్ ఆఫర్స్ చాలానే వచ్చాయి. అలా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని అమెరికాలోనే శాశ్వతంగా స్థిరపడటానికి అనుభవ్ ముందు అనేక అవకాశాలు ఉన్నాయి. తనతోపాటు చదివిన స్నేహితులు కూడా ఎమ్మెస్ పూర్తయ్యాక ఇండియా తిరిగి వెళ్లకుండా అమెరికాలోనే ఉండిపోవాలని అక్కడే ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. తను కూడా వాళ్ళలా అక్కడే ఉండిపోవొచ్చు. అలా చేస్తే కచ్చితంగా జీవితంలో అన్నివిధాలుగా స్థిరపడిపోవొచ్చు. ఓ సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినాగానీ అమెరికా హోదాకు తగ్గ పెళ్లి సంబంధాన్ని కుదుర్చుకోవచ్చు. కానీ, అనుభవ్ ఆలోచన వేరు. మనసులో తలచిన జీవితాశయం వేరు.

•••

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే మనసులో ఏదో తెలియని ఉద్వేగం. బయటకు రాగానే చిన్నప్పటి నుంచి ఆటాపాట నేర్పిన భూమి తల్లి తనకోసం మట్టివాసన పరిమళాలు వెదజల్లుతూ స్వాగతం పలుకుతోందన్నంత అనుభూతి. ఆ పరిమళం గుండెంతా అల్లుకునేలా బలంగా శ్వాస తీసుకుని పుట్టిపెరిగిన ఊర్లోకి ఎప్పుడెప్పుడు అడుగుపెడదామా? అనే సంతోషంతో బయలుదేరాడు అనుభవ్.

ప్రయివేట్ టాక్సీ విజవాడ హైవే వైపు పరుగులు తీస్తోంది. విమానాశ్రయానికి ఆనుకునివున్న రోడ్లన్నీ చాలా మారిపోయాయి. కొత్త హంగులతో తళతళలాడుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ దాటి ఉండవల్లి గ్రామం వైపు టాక్సీ మళ్ళింది. రోడ్డుపక్కన ఉండే ఇళ్ళు లేవు. ఏపుగా పెరిగి ఉండే చెట్లూ లేవు. అటు ఇటు పదడుగులకుపైగా రోడ్లు వెనక్కి జరిపేశారు. కారు అద్దాల్లోంచి చూస్తుంటే.. అనుభవ్‌కి ఆ ప్రాంతమంతా కొత్తగా తోస్తోంది. రోడ్డువారగా నిర్మాణంలోవున్న అపార్ట్‌మెంట్లు, రెండు మూడంతస్థుల భవనాలు పట్నపు సంస్కృతిని గుర్తుకు తెస్తున్నాయి. "రెండేళ్ళలో ఊళ్ళో చాలా మార్పులొచ్చాయే.." అని మనసులో అనుకుంటుండగానే టాక్సీ ఆగింది.

" మీరు చెప్పిన చోటు ఇదే సార్" అన్నాడు టాక్సీ డ్రైవర్. అనుభవ్ కారులోంచే చుట్టూ చూశాడు. అంతా కొత్తగా ఉంది. ఇక్కడే రోడ్డువారన త్రిమూర్తుల బడ్డీకొట్టు ఉండేది. అది కనపడ్డంలేదు. సమయం తెల్లారుజాము అయిదున్నర కావొస్తుంది. ఈ సమయంలో బడ్డీకొట్టు చుట్టూ పరగడుపునే టీ తాగడం కోసం వ్యవసాయ కూలీలు సందడిగా కనిపించేవారు. ఇప్పుడు ఆ వాతావరణమేం కనపడ్డంలేదు. "రోడ్డు విస్తరణ పనుల్లో టీకొట్టు తీసేసుంటారేమో" అనుకుని డిక్కీలోవున్న లగేజి తీసుకుని, టాక్సీ డ్రైవర్‌కి సరిపడా డబ్బులిచ్చేసి ఇంటిని వెదుక్కుంటూ బయలుదేరాడు అనుభవ్.

నిజానికి అనుభవ్‌ని రిసీవ్ చేసుకోడానికి మనోజ్ వస్తానని పదే పదే అడిగాడు. కానీ "వద్దురా తమ్ముడూ.. అర్ధరాత్రిపూట ఊళ్ళోంచి గన్నవరం దాకా రావడం నీకు ఇబ్బందవుతుంది. నేను ఎయిర్‌పోర్ట్ నుంచే నేరుగా ఇంటికొచ్చేస్తాలే.. నాకేం ఇబ్బంది కలగదు" అని తమ్ముడ్ని వారించాడు.

అనుభవ్ వీధి మలుపు తిరిగి ఇంటికి సమీపిస్తుండగా తండ్రి రఘురామయ్య, తమ్ముడు మనోజ్ ఇద్దరూ ఎదురొచ్చారు. చేతులోంచి లగేజి లాక్కుంటేనే "అన్నయ్యా.. బావున్నావా? మధ్యలో ఎక్కడైనా ఆగి, టీ ఏదైనా తాగావా?!" అంటూ అన్నను పలకరించాడు మనోజ్.

చాలా రోజుల తర్వాత అన్నను చూసిన ఆనందం మనోజ్ గొంతులో స్పష్టంగా వినపడుతోంది. తెలతెలవారుతున్న ఆ వెలుగులో తమ్ముడి కళ్ళల్లో మెరుస్తున్న ఆ కంటి చెమ్మ అనుభవ్‌కి స్పష్టంగా కనపడుతోంది.

"ఏరా.. తమ్ముడు ఎయిర్‌పోర్ట్‌కి వత్తానంటే వద్దన్నావట. ఏమీ ఇబ్బంది కలగలేదు కదా?" అంటూ భుజం మీద చెయ్యేసి వీపుపై ప్రేమగా నిమిరాడు రఘురామయ్య. నాన్న స్పర్శకు అనుభవ్ చలించిపోయాడు. మాటపెగలడం లేదు.

" ఏ ఇబ్బంది రాలేదు నాన్నా" తండ్రి కళ్ళల్లోకి కళ్ళుపెట్టి తనివితీరా చూసుకున్నాడు. ఇంటిలోకి అడుగుపెట్టగానే కొడుకుని చూడకుండా రెండేళ్ళపాటు దూరంగావున్న అన్నపూర్ణమ్మ, గభాల్న లేచొచ్చి, రెండు చేతులు పట్టుకుని భోరున ఏడ్చేసింది. అనుభవ్ కళ్ళల్లోనూ కన్నీళ్ళు ఆగడంలేదు. మనోజ్, రఘురామయ్య పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంది. రెండు నిమిషాల నిశ్శబ్దం మాటున ఆ కుటుంబంలోని ఆప్యాతలకు కన్నీరే నాలుగింతల కళ్ళు చేసుకుని ఉప్పొంగిందా? అన్నట్టుగా ఉంది పరిస్థితి.

మానవీయ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలంటారు. కానీ పేగు బంధాల్ని మాత్రం అలా చూడలేం. అమ్మ చేతి స్పర్శ, నాన్న భరోసా, తోబుట్టువుల ఆప్యాయతల్ని ఎన్ని సంపదలిచ్చి కొనగలం. సరిగ్గా ఇదే అనుభూతికి లోనవుతున్నాడు అనుభవ్.

•••

"పొలానికి మనకి ఇంక రుణం తీరి పోయిందిరా పెద్దోడా.. రాజధాని కోసం ప్రభుత్వమోళ్ళు మన పొలం కూడా అడిగారు. ఇవ్వమంటే ఊర్కోరు కదా.. ఈ రెండేళ్ళలో ఇక్కడ చాలా ఇషయాలే జరిగాయిలే. అస్సలు మనకున్న ఆ రెండెకరాల భూమిని ఇవ్వనని.. ఆళ్ళ మొఖం మీదే సెప్పేసా. కానీ అదేదో పర్యాటక నగరమంట ఆళ్ళు గీసిన ప్లాన్లో మన పొలాలు కూడా ఉన్నాయంట. ఇవ్వకపోతే అసలకే మోసం వచ్చేటట్టుందని ఆళ్ళూ ఈళ్ళు చెప్పితే ఇవ్వక తప్పలేదు. తీసుకున్న పొలానికి కొంత కౌలు

డబ్బిలిత్తామన్నారు. రేపు మనం ఉండటానిక్కూడా కాసింత స్థలమిత్తానన్నారులే. ఇదిగో దాదాపు ఏడాది కాలంగా మన పొలంలో సాగు జరగట్లే. ఆ పొలాల్లో వ్యవసాయం చేయొద్దని సెప్పేశారు. పొలం నిండా కంచిత్రం చెట్లు, పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. అయినా ఇప్పుడు ఆ భూమి మందికాదు కదా" నిట్టూర్చాడు రఘురామయ్య.

రెండేళ్ళలో జరిగిన మార్పులకు తండ్రి ఏదో పోగొట్టుకున్న బాధతో కుదేలయిపోయిన సంగతి అనుభవ్‌కి స్పష్టంగా కనపడుతుంది. వ్యవసాయానుబంధం తప్ప మరొకటి ఎరుగని, తెలియని కన్నతండ్రి గుండెల్ని తెలియని బాధేదో తొలిచేస్తుందని అర్థమయ్యింది. తండ్రికేకాదు, అనుభవ్‌కీ అలాగే ఉంది. ఆ మాటకొస్తే ఇంట్లో వాళ్ళెవ్వరూ మునిపటిలా లేరు. పాడి లేదు, పంట లేదు. తీసుకున్న పొలాలకు ప్రతిఫలంగా అంతో ఇంతో గవర్నమెంటోళ్ళు ఇచ్చిన డబ్బులున్నాయి. కానీ మనసులో తృప్తిలేదు. ఒక్క రఘురామయ్యేకాదు. అర్థాంతరంగా భూములు కోల్పోవాల్సి వచ్చిన చాలామంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. ఏదో అద్భుతం జరగబోతుందంటూ గొప్పగా చెప్తున్న మాటల్ని నమ్ముకుని పచ్చని పొలాలకు దూరంగా ఉండటం శరీరానికి, మనసుకీ కష్టంగానే ఉంది.

నిజానికి అనుభవ్ అనుకున్నది వేరు. అమెరికాలో ఎంబీబీఎస్ తర్వాత పైకోర్సు పూర్తిచేసి రావడానికి కారణం వేరు. కన్నవాళ్ళకు దగ్గరగా, పుట్టిపెరిగిన ఊళ్లోనే.. ఆ ఊరి ప్రజల మధ్యనే డాక్టర్‌గా ఉండాలనుకున్నాడు. వ్యవసాయం అలవాటు లేకపోయినా గానీ తండ్రి, తమ్ముడు చేస్తున్న పనులు చూస్తూ.. ఉమ్మడి కుటుంబపు అనుబంధాల మధ్య..అచ్చంగా పల్లె వాసన పీల్చుకుంటూ జీవితం గడపిస్తే చాలు అనుకున్నాడు. అనుభవ్‌కి పుట్టిపెరిగిన ఊరంటే అంత ఇష్టం.

•••

" రేయ్ పెద్దోడ.. గవర్నమెంటోళ్ళు తీసుకున్న పొలానికి ఎలాగూ డబ్బులిత్తారుగా.. పట్నంలో హాస్పిటల్ పెట్టుకోడానికి ఆ డబ్బులు సరిపోతాయా? ఇంకా కావాలా? ఎలాగూ ఈడ వెవసాయం లేదు కదా, నింపాదిగా నువ్వు కుదురుకున్నాక.. అమ్మా, నేను నీకాడికి వచ్చేత్తాములే.. ఈలోగా ఇక్కడే ఏదో ఒకటి చేసుకుంటూ కాలక్షేపం అవుద్దిలే. కుదిరితే తమ్ముడ్ని కూడా నీతో తీసుకుపో. ఇన్నాళ్ళు ఆడు కూడా ఉద్యోగం వద్దనుకుని పొలం పట్టుకునే ఏలాడాడు. మరి ఆడిక్కూడా ఏదో భవిష్యత్తు చూడాలి కదా" అని తండ్రి అంటుంటే "ఈ భూమికి మనకు రుణం తీరుపోయిందిరా.." అని తండ్రి ఎంతో ఆవేదనతోన్నట్టుగా ఆ మాటలు వినపడుతున్నాయి. " రాజధాని నిర్మాణం, అభివృద్ధి అనే నినాదాల మైకంలో చివరికి భూమిని నమ్ముకున్న రైతును కూడా ఊరు పొమ్మంటుందా.. " ఇలా అనుభవ్ మదిలో అనేక అలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

•••

"మావయ్య ఊళ్ళో పొలాల రేట్లు ఎలా ఉన్నాయి నాన్నా?" అడిగాడు అనుభవ్.

"అక్కడ రాజధాని ప్రభావం అంతగా లేదురా పెద్దోడా.. ఆ భూముల్లో ఏమేసినా బంగారం పండుద్ది. రేట్లుకూడా పర్లేదు.. ఆ మధ్య రెండెకరాల భూమి అమ్మడానికొచ్చిందంటూ.. మీ మామ కబురట్టుకొచ్చాడు. ఆ టైమ్‌లో మనకాడ కూడా డబ్బులున్నాయి. ఈడ ఎలాగూ మన భూమి పోతాంది కదా,. ఆడైనా కొందామనుకున్నా.. మళ్ళీ నీ హాస్పిటల్‌కి డబ్బులుండవని వద్దనేశా" అని పొరుగూరిలోని పొలం బేరంకొచ్చిన సంగతి గురించి చెప్పాడు రఘురామయ్య.

అమెరికా నుంచి వచ్చిన దగ్గర నుంచీ నిద్ర పట్టనివ్వని ఆలోచలెన్నింటికో.. తండ్రి చెప్పిన విషయంతో పరిష్కారం దొరికినట్టయ్యింది అనుభవ్‌కి.

"నాన్నా.. వెంటనే మావయ్యకి ఫోన్ చేసి.. ఆ పొలం బేరమాడమని చెప్పండి. రేపే ఆ భూములు చూసొద్దాం" అంటూ అనుభవ్ ఉత్సాహంగా అనేసరికి రఘురామయ్య కళ్ళల్లో ఏదో మెరుపు.

రైతు సంతోషంగా ఉంటేనే.. అతడి కుటుంబం సంతోషంగా ఉంటుంది. రైతు కుటుంబం సంతోషంగా ఉంటే.. ఊరంతా సంతోషంగా ఉంటుంది. ఆ సంతోషాన్ని కళ్ళారా చూడాలన్నదే అనుభవ్ ఆశ.

"నాన్నా.. నాకు పట్నం వెళ్ళాలని లేదు. ఇక్కడే ఉంటా.. మీతోనే ఉంటా.. యిక్కడే చిన్నగా ప్రాక్టీస్ మొదలుపెడతా.. అందరం ఒకే చోట ఉందాం.." అని అనుభవ్ అనేసరికి అందరికీ వెయ్యేనుగల బలం వచ్చినట్టుయ్యింది. "చెట్టుకొకరు, పుట్టకొకరంగా బతకాలేమో.." అని ఆందోళన పడుతున్న మనసులన్నీ ఒక్కసారిగా స్థిమిత పడ్డాయి.

వాకిట్లో వరసగా పేర్చివున్న పూల కుండీల్లో అన్నపూర్ణమ్మ నీళ్ళు పోస్తోంది. ఆప్యాయతల్ని వండి వడ్డించే చేతుల్లోంచి జారిపడుతున్న నీటి స్పర్శకు విత్తనాలూ సంతోషంగా మొలకెత్తేందుకు పోటీపడుతున్నట్టుగా ఉంది.

అప్పటిదాకా స్తబ్దతగా గోడకు వేలాడుతున్న ఎద్దు మెడ మువ్వల పట్టీల్లోని సిరిమువ్వల్లో సైతం కదలిక మొదలై ఆనందంతో శబ్దం చేస్తున్నాయి. కొన్నాళ్ళుగా నిస్తేజంగావున్న ఆ కుటుంబ సభ్యుల మోముపై చిరునవ్వు స్పష్టంగా కనపడుతోంది.

ఒక మంచి నిర్ణయంతో ఇప్పుడు అనుభవ్ మనసు తేలికపడింది.

మళ్లీ రేపో మాపో.. ఆ ఇంటి చెమట చుక్కల సాక్షిగా..

నేలతల్లి గుండెలపై పచ్చని అంకురం ఉదయించబోతుంది.

✦



కెమెరా అబ్స్కురా

క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన 'డార్క్ చాంబర్' అనే అర్థానిచ్చే కెమెరా అబ్స్కురానే మన తొలి కెమెరాగా చెప్పుకోవచ్చు. చీకటి గదిలోకి ఓ సన్నని రంధ్రం గుండా కాంతి ప్రసరించేలా చేయడం వల్ల బయటి ప్రపంచానికి చెందిన ఓ అస్పష్ట చిత్రాన్ని ఏర్పరుస్తుంది. క్రీ.శ. 11వ శతాబ్దంలో అరబ్ మేధావి అల్‌హజెన్ కెమెరా అబ్స్కురా మోడల్‌ను విజయవంతంగా రూపొందించి పాపులర్ చేశాడు.



ఆటో క్రోమ్

నలుపు-తెలుపుల కలబోతగా ఉండే ఛాయాచిత్రాలకు రంగులనద్దింది ఆటోక్రోమ్. 1907లో ఫ్రెంచి సహోదరులు లూయిస్, ఆగస్టె ల్యూమియర్‌లు ఒక అడ్డిటివ్ కలర్‌ను మార్కెట్ చేశారు. వీరే సినిమాను ప్రపంచ తెరపైకి తెచ్చారు. ఆ అడ్డిటివ్ కలరే ఆటోక్రోమ్. 1935 వరకు ఈ కలర్ ఫిల్మ్ పద్ధతి కొనసాగింది. తర్వాత వచ్చిన ఈస్ట్‌మన్ కొడాక్ కంపెనీకి చెందిన కొడాక్రోమ్ ఫిల్మ్ ఫొటోగ్రఫీ గతినే మార్చేసింది.

కెమెరా చేతికి చిక్కిందిలా..



దాగ్యురియోటైప్

నీసెఫోర్ నీప్సెతో కలసి పనిచేసిన ఫ్రెంచి కళాకారుడు లూయిస్ డాగ్యురె 1837లో ఫొటోగ్రఫీలో ఓ పెద్ద ముందడుగు వేయించాడు. పాదరసం పొగల (మెర్క్యూరీ ఫ్యూమ్స్) ద్వారా ఫొటోను డెవలప్ చేయొచ్చని ఆయన కనిపెట్టాడు. ఈ కొత్త టెక్నిక్ ద్వారా మరింత షార్పర్ చిత్రం రావడమే కాక ఎక్స్‌పోజర్ కాలం గంటల నుంచి కేవలం 10 నుంచి 20 నిమిషాలకు దిగొచ్చింది. ఈ కొత్త పద్ధతికి 'డాగ్యురియోటైప్' అని పేరు పెట్టారు.

కాలోటైప్

1841లో బ్రిటిష్ సృజనకారుడు విలియం హెన్రీ ఫాక్స్ టాల్బోట్ మెటల్ ప్లేట్ల బదులు అత్యంత నాణ్యమైన ఫొటోసెన్సిటివ్ కాగితాన్ని వాడాడు. దానిపై తయారైన చిత్రాన్ని హైపో సల్ఫేట్‌తో రుద్ది డెవలప్ చేసి భద్రపరిచే టెక్నిక్‌తో సంచలనం సృష్టించాడు. దీని వల్ల మరిన్ని ప్రింట్లు తీసుకునే అవకాశం కలిగింది. ఒక నెగటివ్ నుంచి అనేక కాపీలు తీసుకోవడమనేది అప్పటి నుంచే మొదలైంది.

వెట్ కొల్లోడియన్ పద్ధతి

1851లో ఫ్రెడెరిక్ స్కాట్ ఆర్చర్ అనే శిల్పకారుడు ఈ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టాడు. గాజు ప్లేట్లపై కొల్లోడియన్ అనే రసాయనం ద్వారా పూతను తెల్గిగ్గా వేశాడు. వీటినే వెట్ ప్లేట్‌లంటారు. ఇవి ఎక్స్‌పోజర్ కాలాన్ని క్షణాలకు తగ్గించేశాయి. అయితే ప్లేట్లు తడారిపోయేలోపు ప్రాసెస్ చేయాల్సిరావడం వల్ల డార్క్ రూమ్ టెంట్లను కూడా తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇదే ఆ పద్ధతిలో పెద్ద లోపం.

తొలి ఛాయా చిత్రం

18-19 శతాబ్దాల మధ్య కాలంలో ఫొటో కెమికల్స్ ద్వారా చిత్రాల్ని అచ్చు వేసే ప్రయత్నాలు జరిగాయి. 1725లో జర్మన్ ప్రొఫెసర్ జోహాన్ హెన్రిక్ స్కుల్జ్ కనిపెట్టిన విషయం ప్రింట్ల ఆలోచనకు బీజం వేసింది. వెండి లవణాల రంగు కాంతి ప్రభావానికి మారుతుందని ఆయన గ్రహించాడు. 1827లో ఫ్రెంచి ఆవిష్కర్త జోసెఫ్ నీసెఫోర్ నీప్సె చిత్రాన్ని బంధించే ఓ ప్రయోగం చేశాడు. జుడియా బిటుమెన్‌ను ప్యూటర్ ప్లేట్‌కు పూత వేసి కెమెరా అబ్స్కురా ద్వారా చిత్రాన్ని ఒడిసిపట్టాడు. ఎనిమిది గంటల పాటు చేసిన ఆ ప్రయోగంలో తన ఇంటి ప్రాంగణ చిత్రాన్ని బంధించాడు. దీనినే తొలి ఛాయాచిత్రంగా పరిగణిస్తారు.

డ్రై ప్లేట్స్



1870ల్లో రాబర్ట్ ఎల్ మాడ్డాక్స్ జెలటిన్‌లో వెండి లవణాల్ని వాడి పొడి ప్లేట్లను రూపొందించాడు. ఇవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు అధిక సంఖ్యలో ఉత్పత్తి చేయొచ్చు. ఇవి ఫొటోగ్రాఫర్ల సమస్యల్ని తగ్గించేశాయి. కదిలే దృశ్యాల్ని కూడా ఒడిసిపట్టగలగడం మరో అవకాశం. 1880లో ఫొటోగ్రాఫర్ ఈడ్వేర్డ్ మ్యూబ్రిడ్జ్ డ్రై ప్లేట్లను ఉపయోగించి మనిషి, జంతువుల కదలికలను కెమెరాలో బంధించే ప్రయత్నాలు చేశాడు. ఆయన పరిశోధనలు ఓ రకంగా సినిమా అనే మరో గొప్ప సృజనకు ప్రేరణనిచ్చాయి.

రోల్ ఫిల్మ్



1880లో ఆవిష్కర్త జార్జ్ ఈస్ట్‌మన్ చుట్టల్లో ఫిల్మ్‌ను తయారుచేయడం మొదలెట్టాడు. ఇది చాలా తేలికగా ఉండేది. చుట్ట వల్ల పదుల చిత్రాలు ఒకేసారి తీసే అవకాశం కలిగింది. ఈస్ట్‌మన్ తొలి కొడాక్ కెమెరాకు వీటినే వాడాడు. తర్వాత ఏడాదికే వచ్చిన సెల్యూలాయిడ్ వల్ల ఫిల్మ్ పరిస్థితే మారిపోయింది. దాదాపు వందేళ్ల పాటు అంటే డిజిటల్ కెమెరాలొచ్చేంత వరకు ఇదే ఫొటోగ్రఫీలో రాజ్యమేలింది.

(ఆగస్టు 19 అంతర్జాతీయ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా...)



బిలియనీర్ బార్బర్

ఓడలు బళ్లవడం...బళ్లు ఓడలవడం...గురించి వినే వుంటాం. అయితే ఈ రెండిటినీ చవిచూసిన అనుభవం బెంగళూరుకు చెందిన బార్బర్ రమేష్‌బాబుది. ఒకప్పుడు నాలుగిళ్లలో పనిచేసి అమ్మ తీసుకొచ్చే నాలుగు ముద్దల కోసం పడిగాపులు కాసిన వాడు... ఇవాళ వందలాది మందికి బతుకు దెరువునిచ్చే స్థితికి చేరుకున్నాడు. ఇంత ఎదిగినా ...తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన క్షౌర వృత్తిని వదులుకోకపోగా తన పిల్లలకూ నేర్పుతానంటున్నాడు.

అప్పుడు రమేష్‌కు ఏడేళ్లుంటాయేమో! రెండవ తరగతి చదువుతున్నాడు. తెల్సినవాళ్లెవరో పరుగుపరుగున వచ్చి వాళ్ల నాన్న గుండెపోటుతో చనిపోయాడన్న వార్తను తల్లికి చేరవేశారు. అంతే! ఆ ఇంటి పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అప్పటి దాకా క్షౌరశాల నడుపుతూ తండ్రి తీసుకొచ్చే ఆదాయంతోనే ఇల్లు గడిచేది. గొప్పగా కాకపోయినా... ఆకలి తెలిసేది కాదు. ఆయన పోయాక ఆ షాపును నడిపేవాళ్లు కరవయ్యారు. దాంతో వాళ్ల బాబాయికి అద్దెకిచ్చేశారు. ఎన్నడూ కాలు బయట పెట్టని తల్లి పాచిపనికి కుదిరింది. అక్కడ యజమానులు దయతలచి ఇచ్చే చద్ది అన్నాలు, కూరలు, టిఫిన్లతోనే ఆ నల్గురు కడుపు నింపుకోవాల్సి వచ్చేది. ఉదయం అల్పాహారం సంగతే మర్చిపోయారు. అమ్మ తెచ్చే అన్నం కోసం ఆవురావురుమంటూ ముందు గదిలోనే ఎదుర్లు చూసేవారు ముగ్గురూ. రాత్రుళ్లు ఒక్కోసారి తినేందుకు ఏమీ లేక మంచినీళ్లు తాగి పడుకునేవారు. ఆకలిదప్పికలతో మరో ఏడేళ్లు కాలగర్భంలో కలిసిపోయి... రమేష్ పదమూడేళ్లవాడయ్యాడు. ఓరోజు స్కూలు నుంచి ఇంటికొచ్చేసరికి తన తల్లి ...బాబాయితో ఘర్షణ పడడం గమనించాడు. షాపు కిరాయి పెంచమంటోంది తల్లి. ఎప్పటి మాదిరిగానే రూ.150 ఇస్తానని, అంతకంటే ఒక్క పైసా కూడా ఇవ్వడానికి కుదరదని బాబాయి తెగేసి చెప్తున్నాడు. అది నచ్చని రమేష్ ఒక్క ఉదుటున వారి మధ్యకెళ్లి 'షాపు నేను నడుపుతా' అన్నాడు. ఆ మాటలు వారి జీవితాలనే మార్చివేస్తాయని ఊహించలేదానాడు. ఇద్దరిని పనిలో పెట్టుకుని వారి సాయంతో సెలూన్ నడిపేవాడు. అలా అనుకోకుండా ఓరోజు తనూ కత్తెర పట్టుకోవాల్సి వచ్చింది. అంతక ముందెన్నడూ ఆ పనిలో ప్రవేశం లేనప్పటికీ చకచకా చేసేశాడు. ఓసారి బాబాయ్ కారు కొన్నాడని పందేనికి అప్పు చేసి మరీ ఓ కారు కొన్నాడు. కానీ నెలనెలా వడ్డీ కట్టడమే కనాకష్టంగా వుండేది. అప్పుడు అమ్మ పనిచేసే ఇంటి యజమాని ఒకరు ఆ కారును కంపెనీలకు అద్దెకివ్వొచ్చంటూ ఇచ్చిన సలహా బాగా పనిచేసింది. ఆ తర్వాత ఖరీదైన కార్లెన్నిటినో కొనుగోలు చేసి అద్దెకు తిప్పసాగాడు.

200 కార్లకు యజమాని

బి.ఎం.డబ్ల్యు మొదలుకొని రోల్స్ రాయిస్ వరకు 200 రకాల కార్లు, 100 విలాసవంతమైన వాహనాలు ఇప్పుడు రమేష్ బాబు గ్యారేజీలో వున్నాయి. 'రమేష్ టూర్స్ అండ్ ట్రావెల్స్' పేరిట నడుపుతున్న కంపెనీకి ఇప్పుడు బెంగళూరులో మంచి పేరుంది. బాలీవుడ్ తారలు మొదలుకొని రాజకీయ నాయకుల వరకు అందరూ ఆ కార్లను వాడేవారే. నగరానికి వచ్చిన ఐశ్వర్యారాయ్ మొదలుకొని అమితాబ్ బచ్చన్ వరకు అందరూ రమేష్ కార్లను అద్దెకు తీసుకుని నగరంలో చక్కర్లు కొట్టినవారే. మొత్తం ఇప్పుడా కంపెనీలో 137 మంది డ్రైవర్లు, 18 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. తండ్రి వారసత్వంగా వచ్చిన ఒక్క సెలూన్‌తోనే ఆగిపోకుండా నగరమంతా విస్తరింపచేశాడు. మొత్తం 200 సెలూన్లుంటే వాటిలో 60 అత్యంత అధునాతన సౌకర్యాలతో నడిచేవే. ఇంత డబ్బు, పేరు సంపాదించినా ఇప్పటికీ సెలూన్‌లో కత్తెర పట్టుకోవాల్సిందే.

కష్టే ఫలి

రమేష్‌బాబు కష్టపడ్డాడు. సాధించాడు. ఆ కష్టం విలువ అతనికి తెలిసినంతగా మరెవరికీ తెలీదేమో! తండ్రి పోయిన కొద్ది సంవత్సరాల పాటు పొద్దున్నే ఇంటింటికీ తిరిగి పేపర్లు...పాలు అందించడం వంటి చిన్నా చితక పనులెన్నో చేసేవాడు. రోజుకు 16 గంటలు కష్టపడేవాడు. రాత్రిపూట కాలేజీకెళ్లి చదువుకునేవాడు. ఇవాళ బిలియనీరయ్యాక కూడా ఏమాత్రం ఖాళీగా వుండడు. ఆకలితో కడుపు నకనకలాడినప్పుడు ఎంత కష్టాన్నయితే చేశాడో... అంతే కష్టాన్ని నేటికీ చేస్తున్నాడు. అతనికి రోజు ఉదయం 5 గంటలకే మొదలౌతుంది. ముందుగా తన 250 కార్లూ సరిగా వున్నాయో లేదో పరీక్షించిన తర్వాతే ప్యాసెంజర్లకు ఇవ్వడానికి అనుమతిస్తాడు. ఆ తర్వాత సెలూన్ చేరుకుని ... వంద రూపాయలకు తల పని చేసేస్తాడు. ఎంత ఎదిగినా నాన్న నుంచి వచ్చిన వృత్తిని మాత్రం విడువనంటాడు. పైగా తన పిల్లలకూ నేర్వాలని ఆశ. బాగా చిన్న పిల్లలు కావడంతో ప్రస్తుతానికి ఆగాడంతే. ఇవాళ వున్న కార్లు, ఆస్తులు రేపు వున్నా లేకున్నా...కుల వృత్తి చేతిలో వుంటే బతుక్కు ఢోకా వుండదని రమేష్ నమ్మకం.

- స్నేహ



మొలకలతో మేలైన రుచులు

సలాడ్

కావాల్సినవి: పెసల మొలకలు- కప్పు, పల్లీల మొలకలు- అరకప్పు, వేయించిన జీడిపప్పు, బాదం,కిస్‌మిస్- పావుకప్పు,నిమ్మరసం- చెంచా, ఉప్పు- తగినంత, తేనె- చెంచా

తయారీ: ఓ గిన్నెలో డ్రైఫ్రూట్స్ తప్ప మిగిలిన పదార్థాలన్నీ కలుపుకోవాలి. తినేముందు డ్రైఫ్రూట్స్ కలిపి వడ్డించుకోవాలి. దీన్ని పొద్దన్నే టిఫిన్‌గానే కాదు, సాయంత్రాలు కూడా తీసుకోవచ్చు.

పనీర్ టాట్స్

కావాల్సినవి: పనీర్ - కప్పు

ఉడికించిన పెసల మొలకలు- కప్పు,అల్లం, వెల్లుల్లి పేస్టు-చెంచా, ఉడికించిన బంగాళాదుంప- ఒకటి పెద్దది, పచ్చిమిర్చి - ఐదారు (పేస్ట్ చేసుకోవాలి), బ్రెడ్ పొడి- అరకప్పు, ఉప్పు-తగినంత, నూనె- కొద్దిగా

తయారీ

పనీర్‌ని తురిమి ఓ గిన్నెలో తీసుకోవాలి. ఇప్పుడు బ్రెడ్ పొడి తప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బుల్లెట్ ఆకృతిలో వచ్చేలా పొడుగ్గా రోల్‌లా చేసుకోవాలి. ఇలా చేసుకున్న వాటిని బ్రెడ్ పొడిలో అద్ది వేడి పెనంపై ఉంచి రెండు వైపులా కొద్దిగా నూనె వేస్తూ కాల్చాలి. లేదంటే... అవెన్‌లో గ్రిల్ కూడా చేసుకోవచ్చు. వీటిని గ్రీన్ చట్నీ లేదా టొమాటో సాస్‌తో కలిపి తింటే చాలా రుచిగా ఉంటాయి. దీన్ని ఒకరోజు ముందుగా చేసి ఫ్రిజ్‌లో ఉంచుకోవచ్చు. మర్నాడు బేక్ చేసుకుంటే సరిపోతుంది.

శాండ్ విచ్



కావాల్సినవి: పెసల మొలకలు- కప్పు, మెంతికూర- కట్ట పచ్చిమిర్చి-ఐదారు, బ్రౌన్ లేదా వైట్ స్లైసులు- ఏడెనిమిది చక్రాల్లా తరిగిన టొమాటో, ఉల్లిపాయ, క్యారెట్, కీరదోస ముక్కలు- కొన్ని, చీజ్ స్లైసులు- ఏడెనిమిది, నూనె- కొద్దిగా, ఉప్పు-తగినంత, టొమాటో సాస్- అరకప్పు

తయారీ

మొలకలు మెంతి ఆకులు, పచ్చిమిర్చి, ఉప్పు మిక్సీలో తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఇప్పుడు ఒక బ్రెడ్ స్లైసును తీసుకుని దానిపై కొద్దిగా నూనె రాసి మొలకల పేస్ట్ జామ్ రాసినట్లు రాయాలి. ఇప్పుడు పెనం వేడిచేసి ఈ స్లైసును రెండువైపులా కాల్చాలి. మొలకల పేసుట రాసిన కొద్దిగా టొమాటో సాస్ రాసి దానిపైన క్యారెట్ టొమాటో, ఉల్లిపాయ, కీరదోస, చీజ్ స్లైస్ ఉంచి దానిపైన పెనంపై కాల్చిన మరో బ్రెడ్ స్లైస్‌ను ఉంచాలి. ఈ శాండ్ విచ్‌ని పిల్లలకు లంచ్ బాక్స్‌లో పెట్టివ్వొచ్చు.

స్ప్రౌట్స్ ట్విస్ట్

కావాల్సినవి:

ఉడికించిన పెసలు మొలకలు- కప్పు
జీలకర్ర పొడి-చెంచా
కారం- చెంచా
ఆమ్‌చూర్ పొడి- పావుచెంచా
ఉప్పు- తగినంత
మైదా- కప్పు
నెయ్యి- చెంచా
వాము- అర చెంచా

తయారీ

పెసలు, జీలకర్ర పొడి, కారం కొద్దిగా ఉప్పు, ఆమ్ చూర్ పొడిని ఓ గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి. అలాగే మరో గిన్నెలో మైదా, నెయ్యి, వాము తీసుకుని నీళ్లతో చపాతీ పిండిలా కలిపి పదిహేను నుంచి ఇరవై నిమిషాలు నాననివ్వాలి. ఆ తరువాత మైదా పిండిని కొద్దిగా తీసుకుని చిన్న చపాతీలా వత్తుకుని మధ్యలో మొలకల మిశ్రమాన్ని ఉంచి చపాతీ మీదంతా పరిచినట్లుగా చేసి తరువాత పొడుగ్గా రోల్‌లా చుట్టుకోవాలి. దీన్ని మళ్లీ గుండ్రంగా వచ్చేలా చుట్టుకోవాలి. ఇలా చేసుకున్న వాటిని పెనంపై ఉంచి కొద్దిగా నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చుకోవాలి.

పరోటా

కావాల్సినవి:

గోధుమ పిండి- ముప్పావు కప్పు
ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు
క్యాబేజీ తరుగు - అర కప్పు
పెసల మొలకలు- అర కప్పు
క్యారెట్ తురుము- పావు కప్పు
పనీర్ తురుము- పావు కప్పు కన్నా కొద్దిగా తక్కువగా
సోయాసాస్- అర చెంచా
ఉప్పు- తగినంత
నూనె- కప్పు, చక్కెర- కొద్దిగా

తయారీ

ముందుగా గోధుమ పిండిలో కొద్దిగా ఉప్పు వేసుకుని నీళ్లతో చపాతీ పిండిలా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో రెండు చెంచాల నూనె వేడిచేసి ఉల్లిపాయల్ని వేయించుకోవాలి. అవి ఎర్రగా వేగాక క్యాబేజీ తరుగూ, పెసల మొలకలూ, క్యారెట్ తురుమూ, పనీర్ కూడా వేసి బాగా వేయించి కొద్దిగా నీళ్లు చల్లి మూత పెట్టేయాలి. క్యాబేజీ పచ్చివాసన పోయాక సోయాసాస్ తగినంత ఉప్పు, చక్కెరా వేసి బాగా కలిపి దింపేయాలి. కూరను మరీ మెత్తగా అవనివ్వకూడదు. ముందుగా కలిపి పెట్టుకున్న చపాతీ పిండిని కొద్దిగా తీసుకుని చిన్న చపాతీలా వత్తి చేసుకున్న క్యాబేజీ మిశ్రమాన్ని దానిపై ఉంచి అంచుల్ని మూసేయాలి. ఇప్పుడు నెమ్మదిగా ఒత్తుకోవాలి. నూనె వేస్తూ రెండు వైపులా కాల్చి పళ్లెంలోకి తీసుకోవాలి. ఇలా మిగిలిన పిండిని కూడా చేసుకుంటే సరిపోతుంది.



బాల నేస్తాలు

ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడుతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో నెమలి బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారుచేసేయండే!



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్... నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: [illegible]

లెక్కించండి

ఇక్కడ కొన్ని యాంగ్రీ బర్డ్స్‌ని ఉంచాం. ఒక్కో వరుసలో మొత్తం ఎన్ని యాంగ్రీ బర్డ్స్ ఉన్నాయో లెక్కించి ఎదురుగా వున్న అంకెల్లో సున్నా చుట్టేయండి.

	1 2 3 4
	1 2 3 4
	1 2 3 4
	1 2 3 4
	1 2 3 4

చుక్కలు కలపండి

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి ఎదురుగా నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి జతచేయండి.

కనిపెట్టండి

బన్నీ వాళ్ల గార్డెన్‌లో ఉన్న పూలన్నిటినీ కోస్తోంది. అయితే ఆ గార్డెన్‌లో మన ఇంట్లో వాడుకునే వస్తువులతో పాటు కొన్ని జంతువులు దాగున్నాయి. కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టండి.

పదాలు గుర్తించండి

rug

box

bug

fox

ఇక్కడ కొన్ని జంతువులు, వస్తువులతో పాటు వాటి పేర్లను ఉంచాం. బొమ్మల ఆధారంగా వాటి పేర్లను గుర్తించి జతచేయండి.

పఫర్ ఫిష్



పిల్లలూ! మీరు చెరువుల్లో, సముద్రాల్లో ఉండే ఎన్నో రకాల చేపల పేర్లు వినే ఉంటారు. అయితే పఫర్ ఫిష్ పేరెప్పుడైనా విన్నారా. అత్యంత విషపూరితమైన చేపల రకాల్లో పఫర్ ఒకటి.

- మనం చూసే చిన్న చిన్న చేపల ఆకృతిలోనే పఫర్‌లు కనిపించినా ఇవి ఒక్క సెకనులోనే వాటి శరీరాకృతిని మార్చేసుకోగలవు.
- ఒక ఇంచ్ మాత్రమే పొడవుండే పఫర్‌లు ప్రమాదాల్ని ఇట్టే గుర్తిస్తాయి.
- అన్ని రకాల చేపల్లాగా పఫర్‌లు వేగంగా ప్రయాణించ లేవు.
- పెద్ద చేపలు వేటాడేందుకు రగానే ఎక్కువగా నీటిని లేదా గాలిని తీసుకుంటూ ఉన్నట్టుండి బెలూన్ ఆకారంలోకి మారిపోయి వాటి నుండి తప్పించుకుంటాయి. వాటి పొట్ట భాగం ఎలాస్టిక్‌లా సాగే గుణాన్ని కలిగుంటుంది.
- దాదాపు అన్ని రకాల పఫర్‌లూ టెట్రొడొ టాక్సిన్ అనే విషాన్ని కలిగుంటాయి.
- ముదురు రంగులో ఉండే వీటి శరీరం ద్వారా ఇవి ఎంత విషపూరితమైనవో గుర్తిస్తారు.
- పఫర్ ఎంత ప్రమాదకరమంటే వీటిలో ఉండే విషం 30 మంది మనుషుల ప్రాణాలు తీయగలదు. ఇది సైనైడ్ కంటే 1200 రెట్లు అత్యంత ప్రమాదకరమైందిగా శాస్త్రవేత్తలు గుర్తించారు.
- వీటి శరీరంపై ఉండే చిన్న చిన్న ముళ్లు వీటికి ప్రత్యేక ఆకర్షణ.
- సొరచేపలపై వీటి విష ప్రభావం లేకపోవడంతో అవి పఫర్‌లని తెగ లాగించేస్తుంటాయి
- సొరచేపలేకాదు ...జపాన్ వాసులూ పఫర్‌లతో చేసే ప్రత్యేక వంటకం ఫూగుని ఇష్టపడతారు.
- ప్రత్యేంగా శిక్షణ పొందిన చెఫ్‌లు మాత్రమే వీటి శరీరంలో ఉండే విషాన్ని తొలగించి ఫూగుని తయారు చేస్తారు.
- పఫర్‌లు పది సంవత్సరాలు జీవిస్తాయి. భారత్‌లోని ఉష్ణనీటి సముద్రాల్లో దాదాపు 120 జాతులున్నాయి.
- దక్షిణ క్యాలిఫోర్నియా, కరీబియన్ దీవులతో పాటు అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాల్లో ఎక్కువగా సంచరించే ఈ చేపలు వాతావరణం, సముద్ర కలుషితాలతో పాటు ఎక్కువగా వేటాడడంతో వాటి ఉనికిని కోల్పోతున్నాయి.



పదవికాసం - 26

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. పర్మిషన్ (4)
3. అప్లికేషన్ (4)
7. రాజుగారి భార్య (2)
8. ఇరుగు పొరుగు కబుర్లకు వేదిక (3)
10. నాగార్జున మొదటి చిత్రంలోని హీరోయిన్ చివర లేదు (2)
11. మహేష్ బాబు సినిమా (2)
12. తిరగబడ్డ ఒక స్వీటు (2)
14. హనీమూన్‌లో చంద్రుడు పారిపోయాడు (2)
15. ఈ గుణం మనిషి మంచితనాన్ని తెలియజేస్తుంది (2)
17. ఆద్యంతాలు లేని విలుకాడు (2)
19. తోక తెగిన చిలుక (2)
21. మన రాష్ట్రానికి చెందిన ఒక చెస్ ఛాంపియన్ పేరులో సగం (2)
22. స్వాతికిరణం సినిమాలో హీరో (3)
24. తెలుగు వీలు కుడి నుండి (2)
27. దారిలో నడిచేవాడు కుడి నుండి రాయండి (4)
28. ఒక ఆకు కూర (4)

1		2			3	4		5
				6				
7			8		9			
		11			12	13		
	14					15		
16		17	18		19			20
21			22	23			24	
		25				26		
27					28			

నిలువు

1. అప్పులపై రాజేంద్రప్రసాద్ నటించిన ఓ సినిమాలో రెండో సగం (4)
2. వాసిరెడ్డి సీతాదేవి నవలలోని మనిషి మాయమయ్యాడు (2)
4. ఇడ్లీల కోసం మినప్పిండిలో కలిపేది (2)
5. శ్రీరస్తు తోడిది కింది నుండి పైకి (4)
6. ఈ బావులు పిల్లల పాలిట శాపాలు (2)
8. 'అన్న" నిలబడ్డాడు'లో ప్రథమాక్షరాలు (2)
9. ఎగ్ (2)
11. నానీకి బహువచనం (3)
13. లక్ష కాదు అనేకం (3)
16. రజనీకాంత్ దారి (4)
18. ఫుల్‌స్టాప్ తోడిది (2)
19. .... చిలకమ్మా అమ్మ కొట్టిందా? (2)
20. షుగర్ (4)
23. అమ్ముకొనిలో ఆద్యంతాలు లేవు (2)
25. 'బగీచా' తెలుగులో (2)
26. మాటల్లో ఒకటి (2)

సుడోకు

					2	3	1	
2			4					
5	9		6	8			7	4
6	5	8	9		7		2	
	7						6	
	2		3		6	7	8	1
9	6			7	3		5	2
					9			8
	8	2	5					

గతవారం జవాబులు

7	3	6	2	8	9	1	4	5
9	2	5	3	1	4	6	7	8
8	1	4	5	6	7	9	2	3
2	4	1	6	3	5	8	9	7
5	6	9	7	2	8	3	1	4
3	8	7	4	9	1	2	5	6
4	9	8	1	7	3	5	6	2
6	5	3	9	4	2	7	8	1
1	7	2	8	5	6	4	3	9

1 ప		2 యం	3 త్రా		4 మె	డ		5 బా
6 డు	7 బి		ణ		డ		8 కో	టి
	9 ల	10 ఋ	షు		11 డు	12 డు	మా	
13 నై		ల		14 వా		మో		15 ఇ
16 శ	బో		17 ఇష్ట	ర	షు		18 గి	లు
టి		19 మం		మి		20 త్రా		గ
	21 బా	ర	22 ము		23 ప	సు	24 పు	
25 దా	స		ఖం		డ		26 బి	27 క్షి
గ		28 రా	గి		29 గ	మ్మ		డే

మన బొమ్మలాటు

తోలు బొమ్మలాటకు భారత్ ప్రపంచ కళా కేంద్రం. తీగ (స్ట్రింగ్), నీడ (షాడో), బద్ద (రాడ్), చేతి తొడుగు (గ్లోవ్), తోలు (లెథర్) ఇలా పలు రకాలుగా ఇక్కడ బొమ్మలాట వికాసం చెందింది. మనిషెత్తు బొమ్మల నుంచి చేతి వేలంత ఆకృతులతో రాజ మహల్ నుంచి వీధి వరకు వినోదం పంచుతోంది. క్రీ.పూ. రెండో శతాబ్దం నాటికే వర్ధిల్లిందని 'శిలప్పాదికారమ్' ద్వారా తెలుస్తోంది. ఆంధ్రావనిలో తోలుబొమ్మలాట, రాజస్థాన్‌లో కథాపుట్లీ, ఒడిశాలో కుంధై, కర్ణాటకలో గోంబెయట్ట, తమిళనాట బొమ్మలాట్టం, బెంగాల్‌లో పుతుల్ నాచ్, బీహార్‌లో యంపురి, కేరళలో పావకూతుగా వైవిధ్యభరితంగా కనిపిస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో ఇషారా, ధాతు వంటి కళా సంస్థలు ప్రదర్శనతోత్సవాలు చేస్తూ విదేశాల్లోను ఇక్కడి కళను పరిచయం చేస్తుంటాయి. బల్గేరియా, అమెరికా, యూకే, స్వీడన్, టర్కీ ఇలా ఎన్నో దేశాల్లో ప్రదర్శనలిస్తున్నాయి.



Dr. KKR's GOWTHAM
HIGH SCHOOLS

Ph: 9160444111, e-mail: kkr_gis@yahoo.co.in, website: www.kkrgowtham.com
Andhra Pradesh • Telangana

ఐఐటి ఫౌండేషన్‌లో డా.కెకెఆర్ గౌతమ్ ఆలిండియా నెం.1 అని... మరోసారి...

నిరూపించాం! నిజం చేసాం!!

తమ చిన్నారులను ఐఐటీయన్లుగా చూడాలనుకునే వందలాది తల్లిదండ్రుల నమ్మకాలను నిజం చేయడమే డా.కెకెఆర్ గౌతమ్ లక్ష్యం!
జేఈఈ మెయిన్స్‌లో డా.కెకెఆర్ గౌతమ్ పూర్వవిద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలే అందుకు తిరుగులేని సాక్ష్యం!!

ALL INDIA JEE (MAINS) 2016

330 /360

Ch.L. Narayana, H.T. No. 10414304

319 / 360

S. Harsha Vardhan, H.T. No. 10414309



315 / 360

T. Pavan Bhargav, H.T. No. 10416543



310 / 360

K. Sathvik Reddy, H.T. No. 10417179

305 / 360

G. Gowtham, H.T. No. 10416116

305 / 360

K.Ch.K. Vara Prasad, H.T. No. 10417060

300 / 360

D. Naga Mithun Reddy, H.T. No. 10416551

300 / 360

G. Dheeraj Kumar, H.T. No. 10416995

300 / 360

K. Sai Kumar Reddy, H.T. No. 10414601

జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా
టాప్ మార్కులు సాధించిన
మా విద్యార్థులకు శుభాభినందనలు.
అధ్యాపకులకు, అధ్యాపకేతర
సిబ్బందికి మా శుభాకాంక్షలు.

JEE (MAINS) 2016లో సెలక్ట్ అయిన మొత్తం విద్యార్థులు

513

ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం

Srigayatri Ads

Check List

Book Number	KNSR09B133	**Date**	03/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	**Cutting By**	Mouni
Scanned By	Sameera	**Pages**	29